ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

ఆదివారం 30 నవంబరు 2025





హెచ్ఐవీ పై అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

- అన్నమయ్యలో రెవెన్యూ విలేజీ.. సత్యసాయిలో భూములు
- ఇబ్బందుల్లో సున్నంవాండ్లపల్లి, అగ్రహారంపల్లి రైతులు
- తనకల్లు మండలంలో చేర్పించాలని ఎమ్మెల్యే కందికుంటకు వినతి



పాపాఘ్నికి ఇటువైపు చెన్నప్పగారిపల్లి రెవెన్యూ సాగుభూములు

ఇక్కడ భూములు.. అక్కడ రికార్డులు

తనకల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): భూములు ఒక జిల్లాలో వాటికి సంబంధించిన రికార్డులు మరో జిల్లాలో ఉండటంతో వాటి యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుకే తమ భూములున్న రెవెన్యూ గ్రామాన్ని తాము ఉంటున్న శ్రీసత్యసాయి జిల్లాలో కలపాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు కూడా ఇచ్చారు.

వేరుచేస్తున్న పాపాఘ్ని

అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాలను పాపాఘ్ని నది వేరు చేస్తూ ప్రవహిస్తోంది. అన్నమయ్యజిల్లా మొలకలచెరువు మండలంలోని గూడుపల్లి పంచాయతీలోని చెన్నప్పగారిపల్లి రెవెన్యూ గ్రామంలో మొత్తం 264 ఎకరాలు భూమి ఉంది. ఇందులో వంద ఎకరాల భూమి శ్రీసత్యసాయి జిల్లాలోని తనకల్లు మండలం టి.సదుం పంచాయతీలోని సున్నంవాండ్లపల్లి, అగ్రహారంపల్లి గ్రామాలకు చెందిన రైతులది. మిగిలిన భూమి పాపాఘ్ని నది, వాగులు, వంకలకు సంబంధించినదిగా ఉంది. వందల సంవత్సరాల కిందట జిల్లాల విభజన జరిగిన సమయంలో చెన్నప్పగారిపల్లి రెవెన్యూ విలేజీకి సంబంధించిన భూములు తనకల్లు మండలంలో ఉండిపోయాయి. అయితే ఆ గ్రామం మాత్రం మొలకలచెరువు మండలంలో ఉంది. చెన్నప్పగారిపల్లి రెవెన్యూ గ్రామంలోని వందల ఎకరాల సాగుభూమి తనకల్లు మండలంలోని సున్నంవాండ్లపల్లి, అగ్రహారంపల్లి గ్రామాలకు చెందిన రైతులది. రికార్డుల నిర్వహణ మాత్రం అన్నమయ్యజిల్లాలోని మొలకలచెరువులో కొనసాగుతోంది. దీంతో అక్కడి రెవెన్యూ అధికారులు పాపాఘ్ని నది దాటి ఇటువైపునకు వచ్చి భూములు తనిఖీ చేయించడం కానీ, సాగు విస్తీర్ణం గుర్తించడం కానీ చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ఏదైనా భూ సమస్య వచ్చినప్పుడు పక్క జిల్లాలోని మొలకలచెరువు మండలానికి వెళ్లాల్సి వస్తోందని భూయజమానులైన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయాలను పరిశీలించి, జిల్లాల పునర్విభజనలో అన్నమయ్యజిల్లా గూడుపల్లి పంచాయతీలోని చెన్నప్పగారిపల్లి రెవెన్యూ గ్రామానికి సంబంధించిన భూములు, వాటి రికార్డులను శ్రీసత్యసాయి జిల్లాలో కలిపేలా చర్యలు తీసుకోవాలని కదిరి ఎమ్మెల్యే కందికుంటను కోరారు. ఈవిషయంపై స్పందించిన ఎమ్మెల్యే రాష్ట్ర ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్తనన్నారు.



రెండుజిల్లాలను వేరుచేస్తూ ప్రవహిస్తున్న పాపాఘ్ని నది

ఇబ్బందులు పడుతున్నాం



ఎప్పుడో వంద సంవత్సరాల కిందట జిల్లాల విభజన సమయంలో చెన్నప్పగారిపల్లి రెవెన్యూ గ్రామం మొలకలచెరువు మండలంలో ఉండిపోయింది. ఈ ఒక్క గ్రామానికి చెందిన భూములు మాత్రమే పాపాఘ్ని నదికి ఇటువైపున ఉన్నాయి. ఈ రెవెన్యూ గ్రామంలో 264ఎకరాల భూములుండగా, వంద ఎకరాల సాగుభూమి ఉంది. సాగుభూమి మొత్తం తనకల్లు మండలంలోని సున్నంవాండ్లపల్లి, అగ్రహారంపల్లి గ్రామాలకు చెందిన రైతులదే. మిగిలిన 164 ఎకరాల్లో పాపాఘ్ని నది, వంకలు, వాగులున్నాయి. ఈ భూములకు సంబంధించి రికార్డుల నిర్వహణ, అజమాయిషీ మొలకలచెరువు మండలానికి చెంది ఉండటంతో మేము ఇబ్బంది పడుతున్నాం. అందుకే ఆ రెవెన్యూ గ్రామంలోని తనకల్లు మండలానికి చెందిన భూములను శ్రీసత్యసాయి జిల్లాలో కలపాలని ఎమ్మెల్యేకి వినతిపత్రం అందించాం.

- శ్రీధర్‌రెడ్డి, రైతు, సున్నంవాండ్లపల్లి

రికార్డులు తనకల్లులో నిర్వహించాలి



చెన్నప్పగారిపల్లి రెవెన్యూ గ్రామానికి సంబంధించిన భూమి జిల్లాల విభజన సమయంలో పాపాఘ్ని నదికి ఇటు వైపు ఉండిపోయింది. రికార్డులు మాత్రం అన్నమయ్యజిల్లా మొలకలచెరువులో ఉన్నాయి. ఈభూములకు సంబంధించిన వివాదాలు, పరిష్కారాలకు మొలకలచెరువుకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. పాపాఘ్ని నదికి ఇటువైపున ఉన్న చెన్నప్పగారిపల్లి రెవెన్యూ గ్రామానికి సంబంధించిన భూములు శ్రీసత్యసాయిజిల్లాలో విలీనం చేసి, రికార్డులు తనకల్లులో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇచ్చాం.

- శ్రీనివాసులు, రైతు, అగ్రహారంపల్లి

తగ్గుతున్న మహమ్మారి..!

హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల పెరిగిన అవగాహన.. ప్రతి ఏటా తగ్గుతున్న బాధితులు

- ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల కృషి వల్లే నియంత్రణ
- రేపు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం



జిల్లాలో ఐదేళ్లలో హెచ్ఐవీ కేసులు ఇలా

	గర్భిణులు			సాధారణ ప్రజలు		
సంవత్సరం	పరీక్షలు చేయించుకున్నవారు	పాజిటివ్ వచ్చిన వారు	శాతం	పరీక్షలు చేయించుకున్నవారు	పాజిటివ్ వచ్చిన వారు	శాతం
2021-22	25,841	21	0.08	50,181	361	0.72
2022-23	32,431	22	0.07	63,060	435	0.69
2023-24	30,255	21	0.07	61,380	428	0.70
2024-25	32,064	12	0.04	74,318	437	0.59
2025-26	17,762	6	0.03	46,011	230	0.50

కొత్తచెరువు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు పేరు వింటేనే సగం చచ్చిపోయేలా ప్రజల్ని భయపెట్టిన మహమ్మారి ఎయిడ్స్. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు, అవగాహన కార్యక్రమాల వల్ల జిల్లాలో వ్యాధి బారిన పడే వారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది. గతంలో ఈ వ్యాధి గురించి నలుగురిలో మాట్లాడాలంటేనే సంశయించే వారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దశాబ్ద కాలానికి ముందు వరకు చాపకింద నీరులా విస్తరించిన హెచ్ఐవీ, ఎయిడ్స్ ప్రజల్లో అవగాహన పెరగడంతో తగ్గుముఖం పట్టింది. వైద్యసిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి ఎంతగానో కృషి చేశాయి. మందులేని ఈ మహమ్మారిని పూర్తిగా నియంత్రించడానికి ప్రపంచవ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా డిసెంబరు 1న ఎయిడ్స్ డే నిర్వహిస్తూ, ప్రజలకు నియంత్రణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో హెచ్ఐవీ చికిత్స కేంద్రాలు...ఇవే

జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు చికిత్స అందించేందుకు రెండు కేంద్రాలు ఉన్నాయి. కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు తరచూ పరీక్షలు, వైద్యం అందిస్తున్నారు. ప్రతి గర్భిణికి హెచ్ఐవీ పరీక్షలు చేస్తున్నారు.

హెచ్ఐవీ సోకితే ఎయిడ్స్ వచ్చినట్లేనా..?

హెచ్ఐవీ (హ్యూమన్ ఇమ్యునో డెఫిషియెన్సీ వైరస్)రక్తంలో ఉండే తెల్ల రక్తకణాల్లో భాగమైన సీడీ-4 అనే కణాలను నాశనం చేస్తుంది. ఈ కణాల సంఖ్య తగ్గడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గి పలు అనారోగ్యాలు తలెత్తే అవకాశం ఉంది. హెచ్ఐవీ సోకినవారు ప్రారంభంలో గుర్తించలేకపోతే దీర్ఘకాలంలో అది ఎయిడ్స్(ఎక్వైర్ ఇమ్యునో డెఫిషియెన్సీ సిండ్రోమ్)గా మారుతుందని వైద్యులు చెబుతున్నారు. ఎయిడ్స్ బాధితుల్లో సీడీ-4 కణాల సంఖ్య 200 కంటే తక్కువకు పడిపోతుంది. ఫలితంగా ఎయిడ్స్ బాధితులను రకరకాల ఇతర అనారోగ్య సమస్యలు చుట్టుముడుతుంటాయి. భవిష్యత్తులో ఇది ప్రాణాంతకం కూడా కావచ్చునని వైద్యులు పేర్కొన్నారు.

అవగాహనతో కట్టడి



విస్తృతమైన కార్యక్రమాల ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల ప్రజలకు చైతన్యం కల్పించాం. తద్వారా జిల్లాలో హెచ్ఐవీ అదుపులోకి వచ్చింది. అవగాహన పెంచుకున్న చాలామంది హెచ్ఐవీ పట్ల అప్రమత్తంగా ఉంటున్నారు. హెచ్ఐవీ బాధితులకు మెరుగైన వైద్యం అందేలా జిల్లాలోని హెచ్ఐవీ కేంద్రాలను తనిఖీ చేస్తున్నాం. గర్భిణుల నుంచి పిల్లలకు ఎట్టిపరిస్థితులలో వ్యాధి సోకకుండా వైద్యసేవలు అందజేస్తున్నాం. ఈ సేవలు అన్నింటి వల్ల ప్రతి ఏటా ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఐఈసీ విభాగంలో అందించే అవార్డుల్లో జిల్లాకు ప్రథమ బహుమతి దక్కింది.

- డాక్టర్ అనుపమ, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నివారణ అధికారి

తల్లి నుంచి బిడ్డకు సోకుతుందా

గర్భిణి అయిన మహిళకు హెచ్ఐవీ పాజిటివ్ అని తేలితే వైద్యుల సలహా మేరకు కొన్ని మందులు వాడాల్సి ఉంటుంది. తద్వారా ఆ వైరస్ బిడ్డకు సోకకుండా కాపాడుకోవచ్చు. అయితే ఈ వ్యాధి తల్లిపాల ద్వారా బిడ్డకు సోకే అవకాశం ఉంది. కాబట్టి ప్రసవం తర్వాత బిడ్డకు పాలు పట్టకుండా తల్లి జాగ్రత్త పడాల్సి ఉంటుందని డాక్టర్లు పేర్కొంటున్నారు.



వీఎల్‌టీ తగ్గింపునకు రూ.7 వేలు లంచం

రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన మున్సిపల్ ఆర్ఐ

హిందూపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు లంచం తీసుకుంటూ ఏసీబీకి శనివారం పట్టుబడ్డాడు. ఖాళీ స్థలంపై పన్ను తగ్గించేందుకు పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లికి చెందిన రవి కుమార్ అనే వ్యక్తి నుంచి రూ.7 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పన్ను విషయమై సంప్రదించిన రవి కుమార్‌ను రూ.10 వేలు ఇవ్వాలని ఆర్ఐ డిమాండ్ చేశాడని, దీంతో బేరమాడి రూ.7 వేలకు బాధితుడు ఒప్పందం కుదుర్చుకున్నాడని ఏసీబీ అధికారులు తెలిపారు. లంచం ఇవ్వడం ఇష్టంలేక తమకు ఫిర్యాదు చేశాడని తెలిపారు.



ఆర్ఐని తీసుకువెళుతున్న ఏసీబీ అధికారులు

ఆర్ఐ దొరకగానే..

ఏసీబీ అధికారుల సూచన మేరకు బాధితుడు మున్సిపల్ కార్యాలయం వద్దకు వెళ్లాడు. ఆర్ఐ రామాంజినేయులు బయటకు వచ్చి లంచం తీసుకోగానే ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆయన్ను కార్యాలయం లోపలికి తీసుకువెళ్లి రెవెన్యూ విభాగంలో పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అక్కడి నుంచి ఆయన్ను వెంటబెట్టుకుని దండు రోడ్డులోని 36వ వార్డు సచివాలయానికి (మిగతా 6వ పేజీలో)

మంత్రి ఇచ్చిన మాట..!

- అధికారులది నిర్లక్ష్యపు బాట
- కదలిక లేని చీనీ ప్రాసెసింగ్ యూనిట్
- యువగళం 800 కి.మీ. మైలురాయి వద్ద లోకేశ్ హామీ
- మర్తాడులో శిలాఫలకం ఆవిష్కరణ
- వేరేచోట స్థల పరిశీలనపై మర్తాడు రైతుల అభ్యంతరం



800 కిలో మీటర్ల మైలు రాయి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నారా లోకేశ్ (ఫైల్)

అనంతపురం అర్బన్ /గార్లదిన్నె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. యువగళం పాదయాత్రలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఇచ్చిన హామీ ఇది. యువగళం పాదయాత్ర గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామంలో 800 కి.మీ. మైలురాయిని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా టీడీపీ అధికారంలోకి రాగానే గార్లదిన్నె మండలంలో చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని అప్పట్లో నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ హామీకి గుర్తుగా మర్తాడులో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రజల మద్దతుతో టీడీపీ కూటమి అఖండ మెజార్టీతో విజయం సాధించింది. ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఇచ్చిన హామీ అమలు దిశగా మంత్రి నారా లోకేశ్ చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో గార్లదిన్నె మండలం కనుంపల్లి, జంబులదిన్నె కొట్టాల ప్రాంతాల్లో రెండు చోట్ల చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం స్థలాలను (పొలాలను) ఏపీ ఫుడ్‌ప్రాసెసింగ్ అధికారులు పరిశీలించారు. ఆ తర్వాత దాని ఊసే మరచిపోయారు.

రూ.3.5 కోట్లతో..

మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు రూ.3.50 కోట్ల వ్యయంతో మూడెకరాలకు పైగా విస్తీర్ణంలో ప్రైమరీ చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని చీనీ రైతులు అభిప్రాయపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 40 వేల హెక్టార్లల్లో చీనీ పంట సాగవుతోంది. జిల్లాలో పండించిన చీనీకి గిరాకీ బాగుంటుంది. ఈ క్రమంలో వ్యాపారులు తోటల వద్దకే వెళ్లి చీనీ పంటను కొనుగోలు (మిగతా 6లో...)

డ్రగ్స్ రహిత జిల్లాకు కృషి

- కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత జిల్లాగా శ్రీసత్యసాయిని రూపొందించడానికి బాధ్యతాయుతంగా కృషి చేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ ఆధ్వర్యంలో ఈగిల్ అండ్ ఎన్కార్డ్ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో గంజాయి, మత్తుపదార్థాల నివారణకు తీసుకోవాల్సిన పటిష్టమైన చర్యల గురించి చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో మాదకద్రవ్యాలను నియంత్రించడానికి ప్రజలకు అనేక కార్యక్రమాల ద్వారా అవగాహన కలిగిస్తున్నామన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల సంభవించే దుష్పరిణామాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పిస్తున్నామన్నారు. అందుకే ప్రతి విద్యాసంస్థలో ఈగల్ క్లబ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. జిల్లాలో చేపట్టిన చర్యలను పీపీటీ ద్వారా ఎస్పీ వివరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 12 కేసులలో 32కిలోల గంజాయి సీజ్ చేసి, 52 మందిని అరెస్టు చేసి, ఏడు వాహనాలు సీజ్ చేసినట్లు వివరించారు. డ్రగ్స్ ఎవరైనా తీసుకుంటున్నారని తెలిస్తే 1972 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన చట్టాలు చాలా కఠినతరంగా ఉంటాయని, డ్రగ్స్ బారిన పడకుండా చైతన్యం కలిగి ఉండాలని ఎస్పీ సూచించారు. సమావేశంలో పోలీసు అధికారులు ఇందిరా, లక్ష్మీకాంత రెడ్డి, డీఈఓ కిష్టప్ప, డీఐఓ సయ్యద్ ఓలా, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, వైద్యశాఖాధికారి వీర కుమార్ రెడ్డి, డీపీఓ సమత, సచివాలయ నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

రేపు పింఛన్ల పంపిణీ



పుట్టపర్తి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం 2,63,048 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. వీరందరికీ రూ.115.30 కోట్లు పింఛన్ సొమ్ము అందించనున్నారు. ఈ మేరకు 4,476 మంది సచివాలయ సిబ్బంది ఉదయం 7 గంటల నుంచి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం పింఛన్లు తీసుకోని వారికి రెండో తేదీ అందిస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

శుభకార్యాలకు మూఢం

ఫిబ్రవరి 17వరకు శుక్రమౌఢ్యమి

- అంతవరకూ ఆగాల్సిందే..

(వివరాలు 6వ పేజీలో)



శిక్ష భయం కలగాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నేరం చేస్తే శిక్ష పడుతుందన్న భయం నేరస్తుల్లో కలిగేలా పోలీసుల విధులు నిర్వహించాలని ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. జిల్లాకేంద్రంలోని సాయిఆరామంలో జిల్లాలోని అన్ని సబ్‌డివిజన్ పోలీసు అధికారులతో శనివారం ఆయన నేర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మహిళలపై నేరాలు, పోక్సో, ఎన్‌డీపీఎస్, హత్య, ప్రాపర్టీనేరాలు, మిస్సింగ్‌కేసులు, గ్రేవ్, పెండింగ్‌కేసులు, ఎన్‌బీడబ్ల్యూఎస్ వారెంట్స్, వంటి అంశాలపై కేసుల వారీగా ఎస్పీ సమీక్షించారు. నాన్‌బెయిలబుల్ కేసులు ఉన్నవారిని వెంటనే అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచాలన్నారు. డీఎస్పీలు ప్రతిరోజు కనీసం ఐదు, సీఐలు ఏడు, ఎస్ఐలు 10 కేసులను పర్యవేక్షించాలని ఎస్పీ ఆదేశించారు. రౌడీషీటర్ల కదలికలను పరిశీలించి, ప్రతి ఆదివారం వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. మహిళలు, చిన్నారుల మీద జరిగే నేరాల నియంత్రణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సైబర్‌నేరాలు, మహిళాభద్రత మాదకద్రవ్యాలు వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలను సందర్శించి ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌ను పెంచి, చోరీల నియంత్రణకు రాత్రివేళ గస్తీని ముమ్మరం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, డీఎస్పీలు విజయ్‌కుమార్, మహేష్, హేమంత్‌కుమార్, నరసింగప్ప, ఇందిర, డీసీఆర్బీ డీఎస్పీ సీఐ శ్రీనివాసులు, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఐటీకోర్ ఇన్చార్జి సుదర్శన్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

విరివిగా రుణాలు ఇవ్వాలి

- జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్లది కీలక పాత్ర
- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్థిక ప్రగతికి విరివిగా రుణాలు ఇవ్వాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ బ్యాంకర్లను కోరారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ(డీఎల్ఆర్‌సీ) బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని బ్యాంకులకు రెండో త్రైమాసికం ముగిసేనాటికి నిర్దేశించిన రుణాలక్ష్యాలు, సాధించిన ప్రగతిని కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను రుణ లక్ష్యాన్ని 71.59 శాతం సాధించినట్లు తెలిపారు. వ్యవసాయ ఆధారితమై శ్రీసత్యసాయి జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు అందజేయాలన్నారు. సీసీఆర్‌సీ రుణాలలో అనుకున్న మేర లక్ష్యాలను సాధించలేదని, ఇందులో నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలన్నారు. ఎంఎస్ఎంఈ సెక్టార్‌కు రూ.843 కోట్లు మంజూరు చేశారని, దీన్ని మరింత మెరుగుపరచాలని తెలిపారు. డీఆర్‌డీఏ, మెప్మా శాఖలు పొదుపు సంఘాలకు రుణాలపై అవగాహన కల్పించి దరఖాస్తులను జనసామర్థ్ పోర్టల్ ద్వారా బ్యాంకులకు చేరవేయాలని సూచించారు. శిశు, కిషోర్, తరుణ్, తరుణ్ ప్లస్ పథకాలకు బ్యాంకర్లు, అధికారులు రుణాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. విద్యారుణాలు, పీఎం సూర్యఘర్ రుణాలు త్వరితగతిన అందించాలని సూచించారు. గృహ రుణాలలో లక్ష్యం మేరకు మంజూరు శాతం పెంచాలని కోరారు. ఆర్థిక అక్షరాస్యతపై విస్తృత అవగాహన కల్పించాలని ఎల్డీఎంకు సూచించారు. పీఎం విశ్వకర్మ, స్టాండ్ ఆప్ ఇండియా పథకం ప్రగతిలో వెనుకబడకుండా లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. గ్రామాల పరిధిలో బ్యాంకింగ్ సేవలను విస్తృతం చేసి, బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. అర్హులైన యువ పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చేలా రుణసదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత జిల్లాకు అన్ని విధాల ఆర్థిక రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వామ్యం కావాలన్నారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు రమణకుమార్, నాబార్డు ఏజీఎం, ఆర్సెటి, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్, డిక్కీ జోనల్ ప్రెసిడెంట్ వెంకటరమణ, డీఐఏ ప్రతినిధులు పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

శుభకార్యాలకు మూఢం

ఫిబ్రవరి 17వరకు శుక్రమౌఢ్యమి

● అంతవరకూ ఆగాల్సిందే..

ధర్మవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శుభకార్యాలకు బ్రేక్ పడింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 17 వరకు దాదాపు 82 రోజులు శుక్రమౌఢ్యమి (మూఢం)కొనసాగనుందని పండితులు రాజేశ్ తెలిపారు. ఈ సమ యాల్లో పెళ్లిళ్ల, గృహప్రవేశాలు, యజ్ఞాలు, కొత్తవ్యాపారాల ప్రారంభం తదితర పనులు చేయరాదని పండితులు చెబుతున్నారు. సాధారణంగా శుభకార్యాలు నిర్వహించాలంటే గురుబలం బాగా ఉండాలి. సిరిసంపదలు, సంతోషాలకు శుక్రబలం ఎక్కువగా ఉండాలి. శుక్రమౌఢ్యమి సమయంలో ఈ రెండు గ్రహాలు బలహీనంగా తేజస్సు కోల్పోయి ఉంటాయని అందుకే శుభకార్యాలు జరుపుకోవద్దని పండితులు సూచిస్తున్నారు.



నిర్వహణ బరువే : చెన్నంశెట్టి జగదీశ్, సీబీఎన్ కల్యాణమండపం యజమాని



మూఢం రావడంతో డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెల వరకు కల్యాణమండపాలను అడిగేవారే ఉండరు. దీంతో కల్యాణమండపాల నిర్వహణకు కూడా బరువుగా మారుతుంది. కనీసం మున్సిపాలిటీ ట్యాక్స్‌లు కట్టడానికి కూడా ఇబ్బందే. అసలే ఆర్థిక సమస్యలతో కల్యాణమండపాలలో కాకుండా చాలామంది దేవాలయాలకు వెళ్లి వివాహాలు చేస్తున్నారు. ఇప్పుడు మూఢ్యం రావడం వల్ల నిర్వహణ మరింత కష్టతరంగా ఉంటుంది.

పవిత్ర తిథులు

మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. ఈ ఏడాది మార్గశిరంలో ఒకటి, రెండుముహూర్తాలు ఉండగా పుష్యమాసం, శూన్యమాసం అవుతుంది. కనుక మాఘంలోనూ ఒక్క ముహూర్తం కూడా లేకపోవడం గమనార్హం. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథసప్తమి, సరస్వతి జన్మదినమైన వసంతపంచమి, మహామాఘిగా కీర్తింపడే మాఘపౌర్ణమి వంటి తిథులు ఈ సారి మూఢంలోనే ఉండటంతో శుభకార్యాలకు మంచిదికాదని పండితులు సూచిస్తున్నారు.

మూఢం అంటే

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుడి కిరణాలలో కనుమరుగై పోవడాన్ని మౌఢ్యమి వాడుక భాషలో మూఢం(చీకటి) అని అంటారు. శుభకార్యాలకు గురువు ఎంత ప్రధాన కారకుడో శుక్రుడు అంతే ప్రభావం కలవాడు. గ్రహశక్తులు బలహీనపడటంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుక్రుడు బలహీనం అయితే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వంలో ప్రతికూలతలు ఏర్పడతాయని జ్యోతిష్యులు చెబుతున్నారు. అందుకే శుక్ర మౌఢ్యం ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభ సూచికం కాదని సూచిస్తున్నారు.

వ్యాపారులపై ప్రభావం

శుభకార్యాలు లేకపోతే వివాహ మండపాలు, ఫంక్షన్‌హాళ్లు, వస్త్ర, ఆభరణాల దుకాణాలు, స్వర్ణకారులు, క్యాటరింగ్, ఫొటో, వీడియో గ్రాఫర్లు, టెంట్‌హౌస్, పూలదుకాణాలు, లైటింగ్, డీజేలు, అద్దెకార్లు, బస్సులు, సన్నాయి మేళం ఇలా సంబంధిత వర్గాలు నెలల కొద్ది నష్టపోవాల్సి వస్తుంది. పౌరోహిత్యంపై ఆధారపడ్డ వారికి గడ్డుకాలమే.

ఫిబ్రవరి 17 వరకు..



ఈ నెల 26 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడునెలల పాటు శుభ కార్యాలకు మంచిరోజులు లేవు. శుక్రమౌఢ్యం వల్ల ఒక్క శుభ ముహూర్తం ఉండదు. శుభకార్యాలతో పాటు గృహ ప్రవేశాలు, విగ్రహప్రతిష్ఠాపనలు కూడా చేసుకోకూడదు.

- రాజేశ్, పురోహితులు, ధర్మవరం

మురుగుతున్న నిర్లక్ష్యం

సోమనాథ్‌నగర్‌లో నడిమివంక దుస్థితి



నగరంలో పడకేసిన పారిశుధ్య నిర్వహణ.. కాలువల్లో ముందుకు సాగని మురుగు

- ఇంటింటా చెత్త సేకరణలో నిర్లక్ష్యం
- రికార్డుల్లోనే హాజరు...క్షేత్రస్థాయిలో కనబడరు
- అధ్వానంగా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ల పనితీరు

కమలానగర్‌లో మురుగు కాలువ దుస్థితి



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు పనితీరు నానాటికి తీసికట్టుగా మారడంతో నగరంలో ఎక్కడ చూసినా మురుగు, చెత్త కనిపిస్తోంది. నగరంలో ఉన్న ఆరు సర్కిళ్లకు ఒక్కరే రెగ్యులర్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. మిగతా వాటికి మేస్త్రులే ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. కనీస విద్యార్హత లేని వారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం వల్లే నగరంలో పారిశుధ్యం పడకేసిందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. రికార్డుల ప్రకారం అటెండెన్స్ నూరు శాతం ఉండగా, క్షేత్రస్థాయిలో పారిశుధ్య సిబ్బంది కనుచూపు మేరలో కనిపించరు. బదిలీ పేరుతో రెగ్యులర్ వర్కర్ల నుంచి కొందరు అధికారులు ముడుపులు పుచ్చుకుని పనిదొంగలకు అండగా నిలుస్తుండటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

సర్కిళ్లు పెంచాలి

నగరంలో పెరుగుతున్న జనాభా, నగర విస్తరణను దృష్టిలో ఉంచుకుని శానిటేషన్ సర్కిళ్లను పెంచాల్సిన అవసరం ఉంది. 40వేల జనాభాకు ఒక సర్కిల్ ఉండాలి. నగరంలో సుమారు 4లక్షలకు పైగా జనాభా ఉంది. ప్రస్తుతం 6 సర్కిళ్ల నుంచి పారిశుధ్య విభాగం పని చేస్తోంది. ప్రస్తుత జనాభా ప్రకారం 10సర్కిళ్లకు పైగా శానిటేషన్ విభాగం ఉండాలి. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 12 సర్కిళ్లను విభజించి, పనిభారం లేకుండా చేసింది. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే మళ్లీ ఆరు సర్కిళ్లకే కుదించింది. దీంతో నగరంలో పారిశుధ్య నిర్వహణ, ఇంటింటా చెత్తసేకరణపై పూర్తిగా నిర్లక్ష్యం ఏర్పడింది. నగరంలో ఉన్న ఆరు సర్కిళ్లలో ఒకటో సర్కిల్‌లో 110మంది, రెండో సర్కిల్‌లో 130, మూడో సర్కిల్‌లో 140, నాలుగో సర్కిల్‌లో 90, ఐదో సర్కిల్‌లో 92, ఆరో సర్కిల్‌లో 82మంది సిబ్బంది పని చేస్తున్నారు.

శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు పనితీరు మార్చుకోరా...!

నగరంలో పారిశుధ్యం, చెత్త సేకరణ మొత్తం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై ఆధారపడి ఉంటుంది. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు నిబద్ధతగా పని చేస్తే నగరం పరిశుభ్రంగా ఉంటుంది. అయితే నగరం ఎట్లాపోతే మాకేంటి అన్న ధోరణిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉండటంతో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. ఉన్న సిబ్బందితో సక్రమంగా పని చేయించకుండా, రెగ్యులర్ వర్కర్లతో ముడుపులు పుచ్చుకుని వారి హాజరును చూసిచూడనట్లు ఉండటం వల్లే పరిస్థితి అధ్వానంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

స్వచ్ఛాంధ్ర పథకానికి తూట్లు

రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకువచ్చిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమానికి అనంత నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం తూట్లు పొడుస్తోంది. నగరం రోడ్లపై చెత్త, మురుగు కనిపించకుండా, శుభ్రంగా ఉంచడమే స్వచ్ఛాంధ్ర లక్ష్యం. అయితే నగరంలో ఇందుకు విరుద్ధమైన పరిస్థితి ఉంది. నగరంలో హౌసింగ్‌బోర్డు, అరవింద్‌నగర్, అశోక్‌నగర్, పాతూరు, రామచంద్రనగర్, రంగస్వామినగర్, రజకనగర్, వేణుగోపాల్‌నగర్, శారదానగర్ ప్రాంతాలలో వారానికి ఒక్కసారి లేదా రెండు సార్లు మాత్రమే ఇంటింటా చెత్త సేకరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. మురుగు కాలవలను ఆరు నెలలైనా శుభ్రం చేయకపోవడంతో చెత్త, మురుగు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పందులు యథేచ్ఛగా తిరుగుతున్నాయని, దోమలు వృద్ధి చెంది పగలే కుట్టేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుత్తిరోడ్డులో భగత్‌సింగ్ నగర్ చెత్తదిబ్బలో ఆవులు

మెరుగు పరిచేందుకు చర్యలు

నగరంలో పారిశుధ్యం మెరుగు పరచడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. పనితీరు మెరుగుపరుచుకోవాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లకు ఇదివరకే సూచించాం. నగరంలో ఆకస్మిక తనిఖీలు చేసి, కార్మికుల పనివేళలు, హాజరు నమోదును ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. ప్రజల ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని మురుగు, చెత్త వెంటనే తొలగించేలా చూస్తున్నాం. ఎమ్మెల్యే, కమిషనర్‌లు తెల్లవారుజామున సర్కిల్ ఆఫీసుల్లో సిబ్బంది అటెండెన్స్ రికార్డులు, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందిని పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందిపై చర్యలు తప్పవు.

- బీఎల్ నరసింహులు, ఎంహెచ్‌ఓ, అనంత నగరపాలక సంస్థ

మంత్రి ఇచ్చిన మాట..!

(5 పేజీ తరువాయి)

చేస్తున్నారు. వాటిని ఢిల్లీ సహా దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు తరలించి భారీ లాభాలను గడిస్తున్నారు. కానీ రైతులకు కష్టానికి తగిన ఫలితం ఉండటం లేదు. కొందరు రైతులు బయట వ్యాపారులకు, మరికొందరు రైతులు అనంతపురం మార్కెట్ యార్డులో చీనీ పంటను అమ్ముకుంటున్నారు. ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ఈ విషయాన్ని గుర్తించే.. మంత్రి నారా లోకేశ్ చీనీ రైతులకు అండగా నిలవాలని నిర్ణయించారు. కానీ అధికారుల అలసత్వం కారణంగా హామీ అమలులో జాప్యం జరుగుతోంది.



ఇటీవల కనుంపల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

స్థలం ఎంపికలో గందరగోళం

మంత్రి లోకేశ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మర్తాడులోనే చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు. గార్లదిన్నె మండలంలో చీనీ ఎక్కువగా పండించే గ్రామాలతోపాటు ఉరవకొండ, ఇతర మండలాల రైతులకు మర్తాడు గ్రామం అనుకూలమని స్థానిక రైతులు చెబుతున్నారు. మర్తాడులో చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతోనే మంత్రి ఇక్కడ శిలాఫకలం ఏర్పాటు చేశారనే అభిప్రాయాన్ని స్థానిక రైతులు, ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. మర్తాడులో చీనీ ప్రాసెసింగ్ ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలం కూడా ఉందని చెబుతున్నారు. కనుంపల్లి, జంబులదిన్నె కొట్టాల ప్రాంతాల్లో చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అధికారులు స్థలాలను పరిశీలించడాన్ని మర్తాడు ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.

మర్తాడులో అనుకూలం..



మర్తాడులో చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు మంత్రి లోకేశ్ శిలాఫకలాన్ని ఆవిష్కరించారు. అప్పట్లోనే హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కూడా హామీ ఇచ్చారు. అధికారులు మండలంలోని ఇతర గ్రామాల్లో చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు స్థలాలను పరిశీలించడం ఏమిటో అర్థం కావడం లేదు. మర్తాడులో చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే మండలంలోని ఇతర గ్రామాలు, ఇతర మండలాల రైతులకు చాలా అనుకూలంగా ఉంటుంది. ఎమ్మెల్యే బండారు శ్రావణి, కలెక్టర్, ఆర్డీఓల దృష్టికి ఇదివరకే ఈ విషయాన్ని తీసుకువెళ్లి, వినతి పత్రాలు సమర్పించాము. రైతులందరికీ అనుకూలమైన మర్తాడులోనే చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

- అవుల కృష్ణయ్య, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు

హామీని నిలబెట్టుకోవాలి..



యువగళం పాదయాత్రలో మంత్రి నారాలోకేశ్ ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలి. మర్తాడులో చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు శిలాఫకలాన్ని ఆవిష్కరించారు. చీనీ పంటను ఎక్కువగా గార్లదిన్నె మండలంలో పండిస్తున్నారన్న కారణంతో అక్కడే చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం మంచిదే. ఆరు నెలల క్రితం ఫుడ్ ప్రాసెసింగ్ అధికారులు గార్లదిన్నె మండలంలో స్థల పరిశీలన చేసి, అంతటితో సరిపెట్టారు. స్థానిక రైతుల అభీష్టం మేరకు అనుకూలమైన ప్రాంతంలోనే ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

త్వరలోనే ఏర్పాటు..



గార్లదిన్నె మండలంలో చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను త్వరలోనే ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం రాష్ట్ర ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరుగుతుంది. గార్లదిన్నె మండలంలోని జంబులదిన్నె కొట్టాల, కనుంపల్లిలో రెండు ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు స్థలాలను చూపించారు. మంత్రి నారా లోకేశ్ మర్తాడు వద్ద శిలాఫలకం ఆవిష్కరించినందున, మర్తాడు ప్రాంతంలోనే చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేయాలని శింగనమల ఎమ్మెల్యే సూచించారు. మర్తాడు ప్రాంతంలో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే రైతులకు అనుకూలంగా ఉంటుందని ఎమ్మెల్యే భావిస్తున్నారు. స్థలం ఎంపిక మరో వారం రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది.

- ఉమాదేవి, ఉద్యానశాఖ జిల్లా అధికారి

ఏసీబీ వలలో ఆర్ఐ

(5వ పేజీ తరువాయి)

వెళ్లి, కొన్ని రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. లంచంగా తీసుకున్న మొత్తం ఆర్ఐకేనా, లేక సచివాలయంలో పనిచేసే ఇతరులకూ వాటా ఉందా అన్న కోణంలో ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు. దాడులలో ఏసీబీ ఉమ్మడి అనంతపురం జిల్లా ఇన్చార్జి డీఎస్పీ సోమన్న, సీఐలు హమీద్ ఖాన్, జయమ్మ, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు. నిందితుడిని అరెస్టు చేశామని, కర్నూలు ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

రూ.3 వేల పన్నుకు..

రవి కుమార్ ఇటీవల ముద్దిరెడ్డిపల్లిలో 69 గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. దీనికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.6 లక్షలకుపైగా విలువ కట్టారు. నిబంధనల మేరకు ఈ స్థలానికి ఏడాదికి రూ.1200 చొప్పున మున్సిపాలిటీకి పన్ను కట్టాలి. నిబంధనల ప్రకారం రెండున్నరేళ్లకు ఖాళీ స్థలం పన్ను (వీఎల్‌టీ) కట్టించుకుంటారు. అలా లెక్కించినా పన్ను రూ.3 వేలు మాత్రమే కట్టించుకోవాలి. కానీ పన్ను కట్టించుకునేందుకు రూ.10 వేలు డిమాండ్ చేశాడు ఆర్ఐ రామాంజినేయులు. అందుకే బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.



విలేకరులతో మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ సోమన్న

ప్రభుత్వానికి రాశాం..

ఆర్ఐని పట్టుకున్న అనంతరం ఏసీబీ డీఎస్పీ సోమన్న విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ, చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడుల అనంతరం రికార్డులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అక్కడ లభించిన నగదుపై ప్రభుత్వానికి నివేదిక పంపించామని అన్నారు. అక్కడి నుంచి ఆదేశాలు వచ్చాక కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి వద్దా కార్యాలయంలో ఉన్నప్పుడు రూ.వెయ్యికి మించి డబ్బు ఉండకూడదని అన్నారు. ఒకవేళ డబ్బులు ఉంటే రిజిష్టర్‌లో నమోదు చేయాలని అన్నారు. ఏసీబీ అధికారులం ఆకస్మిక తనిఖీలు చేస్తుంటామని, ఆ సమయంలో నగదు పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని, లేదంటే ఆ సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

అధికారులు పరార్

ఏసీబీ అధికారుల దాడులు విషయం తెలియగానే మున్సిపల్ కార్యాలయంలోని పలు విభాగాల ఉద్యోగులు మాయమయ్యారు. అధికారులు కనిపించకుండా పోయారు. పట్టణంలోని మరికొన్ని కార్యాలయాల్లో పనిచేసే అధికారులు ముందుగానే విధులు ముగించుకుని వెళ్లిపోయారు. దీంతో సాయంత్రం 4 గంటలు దాటకనే కార్యాలయాల్లో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

కార్మిక హక్కులను కాలరాస్తున్న లేబర్‌కోడ్లు

● ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్

పుట్టపర్తి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికులు హక్కులను కాలరాస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ విమర్శించారు. పుట్టపర్తిలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సురేంద్ర చౌదరి అధ్యక్షతన జిల్లా జనరల్ బాడీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రవీంద్రనాథ్ మాట్లాడుతూ దేశంలో సంపద సృష్టిస్తున్న కార్మికులు, రైతన్నలపైన ప్రభుత్వాలు ఇబ్బందులు కలిగించే చట్టాలను తీసుకువస్తున్నాయన్నారు. ఏఐటీయూసీ కార్మిక వర్గానికి కావలసిన చట్టాలను పోరాటాలు చేసి సాధించిందన్నారు. 44 చట్టాలు ఏఐటీయూసీ పోరాట ఫలితంగా సాధ్యమయ్యాయన్నారు. నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తే 29 చట్టాలు రద్దు అవుతాయని దాని ఫలితంగా కార్మికులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. కార్మిక యూనియన్ ఏర్పాటు చేయాలంటే 100 మందికిపైగా కార్మికులు ఉండాలని లేబర్ కోడ్స్ చెబుతున్నాయన్నారు. కార్మిక హక్కులను నిర్వీర్యం చేసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి పాత చట్టాలను యథాతథంగా ఉంచాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేయడానికి 4 లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఆర్ఎస్ఎస్ భావాజాలంతో కేంద్రప్రభుత్వం ముందుకు సాగుతోందని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, బాలకాశి, జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, అనంతపురం అధ్యక్షులు రాజేష్, వెంకటేష్, వినోద్, పెద్దన్న, ఆనంద్ బాబు, మధునాయక్, బాబు, సంపూర్ణమ్మ, నాగవేణి, కిరణ్ పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.34

అనంతపురం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శనివారం టామోటాలు కిలో గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగు కనిష్ఠంగా రూ.14తో, సరసరిగా రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1650 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

చీనీ టన్ను రూ.22 వేలు



అనంతపురం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రామ వేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 23టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పప్పుశనగలో ఆకుమాడు తెగులు



పప్పుశనగ కాండం ఎండుతున్న దృశ్యం

యల్లనూరు, నవంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలో సాగుచేసిన పప్పుశనగ పంటకు ఆకుమాడు తెగులు సోకినట్లు వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జంగంపల్లి గ్రామంలో పప్పుశనగ పొలాలను పరిశీలించగా ఆకుమాడు తెగులు సోకినట్లు గుర్తించామన్నా రు. ఈ తెగులు ఆశించిన పొలంలో అక్కడక్కడ మొక్కలు ఎండిపోతున్నాయని, కొమ్మలపై గోదుమరంగు మచ్చలు ఏర్పడి కొనభాగం నుంచి కింద వరకు కనిపిస్తున్నట్లు తెలిపారు. అకాల వర్షాలు కురిసినప్పుడు ఈ వ్యాధి సోకే అవకాశం ఉన్నట్లు ఆయన వెల్లడించారు. వ్యాధి నివారణకు ఒక ఎకరాకు హెక్సా కొనజోల్ 400మిల్లీలీటర్లు లేదా ప్రొపికొనజోల్ 200మిల్లీలీటర్లు లేదా క్లోరోథలోనిల్ 400గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు.



పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


హనుమంత రాయుడు (ఫైల్)

కుందుర్పి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన చాకలి హనుమంతరాయుడు (52) అప్పుల బాధతో శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు హనుమంతరాయుడుకు నాలుగెకరాల పొలం ఉంది. అందులో బోరుబావి తవ్వించి, మామిడిసాగు చేశాడు. ఇందుకోసం అప్పులు చేశారు. వాటిని తీర్చలేక పొలాన్ని సైతం బ్యాంకులో తాకట్టుపెట్టాడు. అప్పులు తీర్చేందుకు ఉపాధి కోసం ఏడాది కిందట భార్య అంజనమ్మ, కుమారుడు నవీన్‌తో కలిసి బెంగళూరుకు వలస వెళ్లాడు. వారం రోజుల కిందట బెంగళూరు నుంచి కుందుర్పికి వచ్చాడు. గతంలో ఈయన పెయింట్ పని చేసేవాడు. ఈ నేపథ్యంలో స్థానికంగా పెయింట్ పని దొరికిందని, దాన్ని ముగించుకుని వస్తానని బెంగళూరులోని కుటుంబ సభ్యులకు తెలిపాడు. పని ముగించుకుని శుక్రవారం ఇంటికి వచ్చాడు. ఒంటరిగా ఉండటంతో చేసిన అప్పులు గుర్తుకు వచ్చి, మథనపడుతూ ఇంటి పైకప్పునకు ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు శనివారం ఉదయం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మద్యానికి బానిసై..

బ్రహ్మసముద్రం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎరడికెర గ్రామానికి చెందిన రవి(30), మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మద్యం సేవించేందుకు డబ్బులు కావాలని తన తండ్రి నాగరాజును శనివారం మధ్యాహ్నం అడిగాడని, తన వద్ద డబ్బులు లేవని ఆయన చెప్పడంతో ఇంట్లోకి వెళ్లి చీరతో ఉరివేసుకున్నాడని తెలిపారు. తండ్రి వెళ్లి చూసేసరికే మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రవికి భార్య గౌరమ్మ, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు.

బకెట్‌లో పడి బాలుడి మృతి

అనంతపురం క్రైం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ వెళ్లి నీటి బకెట్‌లో పడిన పసివాడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద సంఘటన అనంతపురం రాణి నగర్‌లో శనివారం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన ఫల్హాజ్, షబ్బీన్ దంపతులకు మూడేళ్లు, 11 నెలల వయసున్న ఇద్దరు కుమారులు శుక్రవారం ఇంటి ముందు ఆటల్లో మునిగిపోయారు. చిన్న కుమారుడు మహ్మద్ ఆహిల్ దగ్గరల్లో ఉన్న నీటి బకెట్ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తూ అందులో తల్లకిందులుగా పడిపోయాడు. బాలుడి తల్లి ఆలస్యంగా గుర్తించి, వెంటనే ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో చికిత్స అందించారు. బాలుడు కోలుకోలేక శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


వెంకటరమణ(ఫైల్)

పుట్లూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండుగారికుంట గ్రామానికి చెందిన వల్లపు వెంకటరమణ(35) అదృశ్యమయ్యాడని పోలీసులు శనివారం తెలిపారు. ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం బహిర్భూమికి వెళుతున్నానని తన భార్యతో చెప్పి వెళ్లాడని, ఆ తరువాత తిరిగి రాలేదని తెలిపారు. వెంకటరమణ భార్య గీతాంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆనంద్‌ది ఆత్మహత్యే: డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ రవిబాబు

కళ్యాణదుర్గం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఆనంద్‌ది ఆత్మహత్యేనని డీఎస్పీ రవిబాబు విలేకరులకు శనివారం స్పష్టం చేశారు. ఈ నెల 21న కళ్యాణదుర్గం శివారులో ఆనంద్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ఉద్యోగం రానందుకు జీవితంపై విరక్తి చెంది తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లిదండ్రులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ తరువాత తమ కుమారుడి మరణంపై అనుమానాలు ఉన్నాయని, హత్య చేశారని ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో పూర్తిస్థాయిలో విచారించామని, పోస్టుమార్టం నివేదికను పరిశీలించామని అన్నారు. హత్య కోణంలో దర్యాప్తు చేశామని, ఆత్మహత్యే అని తేలిందని అన్నారు. ఈ కేసు విషయంలో ఎటువంటి రాజకీయ కోణాలు లేవని స్పష్టం చేశారు. ఇది హత్యేనని భావిస్తే తగిన ఆధారాలు, సాక్షాలను తమకు అందజేయాలని సూచించారు. పోలీసులపై బురద చల్లడం, పరువు హత్య అని ఆరోపణలు చేసేముందు వాస్తవాలు తెలుసుకోవాలని అన్నారు.

ఆర్డీటీ స్టేడియంలో రికీ కేజ్


ఆర్డీటీ విద్యార్థులతో రికీ కేజ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఆర్డీటీ స్టేడియాన్ని గ్రామీ, పద్మశ్రీ అవార్డు గ్రహీత రికీ కేజ్ శనివారం సందర్శించారు. ఆయనకు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్ దంపతులు ఘనంగా స్వాగతం పలికారు. స్టేడియంలో క్రికెట్ గ్రౌండ్, వసతులను రికీ కేజ్ పరిశీలించి, అకాడమీలో పిల్లలతో సంభాషించారు. ఈ సందర్భంగా రికీ కేజ్ మాట్లాడుతూ ఆర్డీటీని సందర్శించడం చాలా సంతోషంగా ఉందని, ఆర్డీటీ క్రీడా మైదానం, ఆవరణలో అత్యాధునిక వసతులు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ హైస్కూల్ చాలా స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. మాంచో ఫెర్రర్ మాట్లాడుతూ రికీ కేజ్ ఆర్డీటీని సందర్శించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడికి రిమాండ్

టీడీపీ నాయకుడిపై దాడి ఫలితం


కోర్టు ఆవరణలో వైసీపీ నాయకుడు కృష్ణమూర్తి

అనంతపురం క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూడో డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకుడు, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ బావ కృష్ణమూర్తికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు శనివారం ఆయన్ను అనంతపురం సబ్‌జైలుకు తరలించారు. ఇటీవల టీడీపీ నేతపై దాడికి సంబంధించిన కేసులో ఆయనను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి, కోర్టుకు హాజరుపరిచారు. ఈ నెల 21న 3వ డివిజన్‌లో తన భర్తపై వైసీపీ నాయకుడు కృష్ణమూర్తి, రాణినగర్‌కు చెందిన మరికొందరు దాడి చేశారని టీడీపీ నాయకుడు కురువ గోపాల్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

టీచర్లకు క్రీడాపోటీలు ప్రారంభం

అనంతపురం విద్య, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల క్రీడాపోటీలు మండలస్థాయిలో శనివారం ప్రారంభమయ్యాయి. ఎంఈఓల పర్యవేక్షణలో పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. తొలిరోజు ఆయా మండలాలలోని వివిధ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు చెందిన పురుష, మహిళా టీచర్లు మండల కేంద్రంలో జరిగిన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గురువులు ఆడుతున్న ఆటలపోటీలను విద్యార్థులు తిలకిస్తూ కేరింతలు కొట్టారు. ఆదివారం కూడా పోటీలు కొనసాగనున్నాయి. ఇక్కడ విజేతలుగా నిలిచిన టీమ్‌లను డివిజన్ స్థాయి పోటీలకు, అక్కడా విజయం సాధిస్తే జిల్లా, ఆపై రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నారు.

తిరోగమనంలో టమోటా ధరలు

నాలుగురోజులుగా తగ్గు ముఖం

మందగించిన ఎగుమతులు

ఆందోళనలో అన్నదాతలు


మార్కెట్‌కు తరలించడానికి టమోటాలను సిద్ధం చేస్తున్న కూలీలు

అనంతపురంరూరల్/తనకల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): టమోటా రైతుల ఆనందం వారం తిరక్కుండానే ఆవిరైపోతోంది. పది రోజుల క్రితం కిలో రూ.50 దాటిన టమోటా ధరలు రూ.34కు పడిపోయాయి. వెరసి టమోటా ధరలు అన్నదాతల జీవితాలతో ఆటడుకుంటున్నాయి. రెండు వారాల క్రితం ఓ మోస్తారుగా సాగాయి. తరువాత ఉన్నఫలంగా ధరలు పెరిగిపోయాయి. ఉమ్మడి జిల్లాలో కిలో గరిష్ఠ ధరలు రూ.50పైగా పలికాయి. దీంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. స్థిరంగా సాగుతున్నాయనుకునేలోపు మళ్లీ తిరోగమనం పట్టాయి. మూడునాలుగురోజులు పతనం వైపు పయనిస్తున్నాయి. జిల్లా నుంచి ఎగుమతులు మందగించడంతో పరిస్థితులు తలకిందులయ్యాయి. తనకల్లు మండలంలో ఖరీఫ్, రబీ సీజన్లతో సంబంధంలేకుండా వేలాది ఎకరాల్లో రైతులు టమోటా సాగు చేస్తుంటారు. టమోటా సాగుచేయడానికి ఎకరానికి రూ.1.50 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో ధరలు నిలకడగా ఉంటే ఎకరాకు రూ.5నుంచి 10 లక్షల వరకు ఆదాయం వచ్చేది. రైతులు అన్నమయ్య జిల్లా ములకలచెరువు, అంగళ్లు, మదనపల్లి మార్కెట్లతో పాటు, కర్ణాటకలోని చింతామణి, వడ్డిపల్లి, కోలార్‌కు టమోటాలను తరలిస్తున్నారు.

గత పదిరోజులుగా టమోటా ధరలు ఇలా

తేది	గరిష్టం కిలో ధర రూ.	సరాసరి	కనిష్టం
20	50	37	27
21	52	37	30
22	47	30	24
23	47	30	24
24	51	37	27
25	49	37	27
26	46	30	24
27	40	27	20
28	37	24	14
29	34	20	14

మూడు రోజుల నుంచి పతనం

అనంతపురం నగరం సమీపంలోని కక్కలపల్లి, కళ్యాణదుర్గంలో టమోటా మార్కెట్లు నడుస్తున్నాయి. ఇప్పటికే కళ్యాణదుర్గంలో మండీలు బంద్ అయినట్లు మార్కెట్ వర్గాలు అంటున్నాయి. కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు రోజూ 1800 నుంచి 2,300 టన్నుల వరకు వస్తున్నాయి. గతంలో కంటే ప్రస్తుతం దిగుబడులు మార్కెట్‌కు తక్కువగానే వస్తున్నాయి. పదిహేను రోజుల కిందట వరకు మేలిరకం కాయలు గరిష్ఠంగా కిలో రూ.20 నుంచి రూ.25 మధ్య పలికాయి. తరువాత అమాంతం పెరిగి కిలో రూ. 50తో అమ్ముడుపోయాయి. సరాసరి ధరలు రూ.35కిపైగా.. కనిష్ఠ ధరలు రూ.25తో పలికాయి. దీంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఇంతలోనే పరిస్థితులు తలకిందులయ్యాయి. గడిచిన మూడునాలుగురోజుల్లో మార్కెట్‌లో ధరలు పరిశీలిస్తే ఇదే విషయం అర్థమవుతుంది.

మందగించిన ఎగుమతులు

ధరల తగ్గుదలకు కారణాలు లేకపోలేదు. మార్కెట్ నుంచి ఎగుమతులు మందగించడం ధరల్లో తగ్గుదలకు ప్రధాన కారణమన్న వాదనలు ఆయా వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. వాతావరణంలో నెలకొన్న మార్పులు మరోకారణంగా నిలుస్తున్నాయి. నాలుగైదురోజుల కిందట వరకు స్థానిక మార్కెట్ నుంచి ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతులు జరిగేవి. ఆయా ప్రాంతాల్లోని స్థానిక మార్కెట్లకు దిగుబడులు లేకపోవడంతో ఎగుమతులు ఆశాజనకంగా సాగాయి. ప్రస్తుతం ఎగుమతులు చాలా వరకు తగ్గిపోయినట్లు తెలుస్తోంది. స్థానిక మార్కెట్‌కు ఆయా ప్రాంతాల నుంచి దిగుబడులు వస్తున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం కేవలం ఆంధ్ర, తమిళనాడు చుట్టుపక్కల ప్రాంతాలకు మాత్రమే ఇక్కడి నుంచి కాయలు ఎగుమతి అవుతున్నాయి.

ఉన్నట్లుండి మార్పులు..



నేను రెండు ఎకరాల్లో టమోటా పంటను సాగుచేశా. పది రోజులక్రితం వరకు టమోటాకు ధరలు లేవు. అడిగే ఆనాథుడే లేక అలాగే వదిలేశాం. ఉన్నట్లుండి ధరలు పెరగడంతో వదిలేసిన తోటకు మందులు పిచికారి చేసి, డ్రిప్ ఎరువులిచ్చి పంటను కాపాడుకున్నా. వారం రోజులపాటు 30 కిలోల బాక్స్ ధర రూ.1400, 1100, 900 పలికాయి. ప్రస్తుతం రూ.600 ధర పలుకుతున్నాయి. నాలుగైదు కోతలు మాత్రమే ధరలు పలికాయి. ప్రస్తుతం ప్రతిరోజూ ధరలు తగ్గిపోతున్నాయి. వాతావరణంలో మార్పుల వల్ల ఉన్నపంటల దెబ్బతింటున్నాయి.

- సూరి, రైతు, పెద్దపల్లి, తనకల్లు మండలం

ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

తనకల్లు మండలంలో సీజన్లతో సంబంధం లేకుండా వేలాది ఎకరాలో టమోటాలు సాగు చేస్తుంటారు. టమోటాకు ధరలు లేనప్పుడు పొలాల్లో వదిలేస్తున్నారు. నేను సీజన్‌తో సంబంధం లేకుండా టమోటా సాగుచేస్తున్నాను. ప్రస్తుతం ఎకరాలో టమోటా సాగుచేశా. టమోటా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి. అవి ఉంటే టమోటాలకు గిట్టుబాటు ధరలు ఉంటాయి. ఇక్కడ పండించే టమోటాలతోనే ఈ ప్రాంతంలో ప్రాసెసింగ్ యూనిట్లు నడపవచ్చు.



- సూర్యనారాయణ, రైతు, కొత్తకురవపల్లి

క్రీడలతో ఆత్మవిశ్వాసం: కలెక్టర్


పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్, చైర్మన్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రీడాపోటీల్లో పాల్గొనడం ద్వారా విభిన్న ప్రతిభావంతులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల క్రీడాపోటీలను కలెక్టర్, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నారాయణస్వామి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం అందించే రిజర్వేషన్లు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అథ్లెటిక్స్, సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ అర్చన, బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి, ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి, డీఎస్‌డీఓ మంజుల, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జాతీయ ఫుట్‌బాల్ పోటీలు

● నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో జాతీయ బాలికల ఫుట్‌బాల్ పోటీలు శనివారం అట్టహాసంగా నిర్వహించారు. గోవా-కేరళ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కు కలెక్టర్ ఆనంద్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించడం సంతోషకరమని కలెక్టర్ తెలిపారు. పోటీల్లో 16జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్

● **అనంతపురం కలెక్టరేట్:** జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ, భూ బదలాయింపు 15రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన జేసీ శివనారాయణశర్మతో కలిసి వివిధ ప్రాజెక్టులకు భూ సేకరణ, భూ బదలాయింపులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రైవేటు పరిశ్రమలకు సంబంధించి భూ సేకరణ, భూ బదలాయింపు చేపట్టాలన్నారు. ఆయా ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ విషయంపై ఆయా శాఖల అధికారులు ప్రతి రోజు పర్యవేక్షించాలన్నారు. కొత్త భూ బదలాయింపు వస్తే ఎక్కడా ఫైల్ పెండింగ్ ఉండటానికి వీలులేదని, వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ మలోల, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, కలెక్టరేట్ సెక్షన్ల సూపరింటెండెంట్లు యుగేశ్వరి దేవి, రియాజుద్దీన్, వసంతలత, నెడ్ క్యాప్ అధికారి కిషోర్‌కుమార్, ఏపీఐఐసీ మేనేజర్ శివమోహన్, బీఎస్ఎన్ఎల్ జేటీఎల్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఫ్లాగ్‌డే సంక్షేమ నిధికి విరాళాలు ఇవ్వండి

కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల ఫ్లాగ్‌డే సంక్షేమ నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన సాయుధ దళాల ఫ్లాగ్‌డే సంక్షేమ నిధికి సంబంధించిన కారు పతాకాలు, స్టిక్కర్లను జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సైనికుల సేవలకు గుర్తింపుగా పౌరసమాజం ఇచ్చే గౌరవ చిహ్నంగా ఫ్లాగ్‌డే నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. కారు ఫ్లాగ్‌లు 5000, స్టిక్కర్లు 3500 అందుబాటులో ఉంచినట్లు ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప కలెక్టర్‌కి వివరించారు. కారు ఫ్లాగ్ ఒకటి ఐదు రూపాయలుగా, స్టిక్కర్ రెండు రూపాయలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజలు వీటిని విరివిగా కొనుగోలు చేయాలని సూచించారు. సాయుధ దళాల పతాక దినోత్సవానికి విరాళాలు ఇవ్వదలచినవారు జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి, అనంతపురం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అకౌంట్ నంబర్ : 62076956433-ఐఎఫ్ఎస్‌సీ కోడ్-ఎస్‌బీఐఎన్0021438 ఖాతాకు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి సీహెచ్.పురుషోత్తం, సైనిక సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో వృద్ధ ఖైదీల విముక్తికి అవకాశం

డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్

కదిరి లీగల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా జైలులో ఉంటున్న వృద్ధులు లోక్ అదాలత్ ద్వారా విడుదలయ్యే అవకాశం ఉందని డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. కదిరి సబ్ జైలును శనివారం ఆయన తనిఖీ చేశారు. సబ్ జైలులో ఉన్న ఖైదీలకు అందుతున్న భోజనం, వైద్యం, సదుపాయాలను పరిశీలించారు. వారి కోసం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. కేసులలో శిక్ష అనుభవిస్తున్న 70 ఏళ్లు దాటిన ఖైదీలకు లోక్ ఆదాలత్ ద్వారా విముక్తి లభించే అవకాశం ఉందని తెలిపారు. అలాంటివారు జైలులో ఉంటే.. జైలు అధికారికి, లేదా సందర్శనకు వచ్చే న్యాయవాదుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. వారికి ఉచిత న్యాయవాదిని కోర్టు ఏర్పాటు చేస్తుందని తెలిపారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికే యూజేఏసీ

ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షకీల్ షఫి


మాట్లాడుతున్న కేఎం షకీల్ షఫి

అనంతపురం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముస్లిం సామాజికవర్గ సమస్యల పరిష్కారం కోసమే యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ(యూజేఏసీ)ని ఏర్పాటు చేస్తున్నట్లు ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫి పేర్కొన్నారు. జిల్లా కేంద్రం లక్ష్మీనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి షకీల్ షఫి, మేయర్ వసీం, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, టీడీపీ ముస్లిం మైనార్టీ విభాగం నాయకుడు తాజుద్దీన్, కాంగ్రెస్ నాయకుడు దాదాగాంధీ, సీపీఐ నాయకుడు జాఫర్ హాజరయ్యారు. షకీల్ షఫి మాట్లాడుతూ ముస్లిం సామాజికవర్గ ప్రజలంతా ఏకతాటిపై నిలవాలని, ఏ ఒక్క ముస్లింకు సమస్య వచ్చిన ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. సీపీఐ నాయకుడు జాఫర్ మాట్లాడుతూ యూజేఏసీ అనేది ఒక వ్యక్తి లేదా పార్టీకి సంబంధించిన కమిటీ కాదని, ముస్లిం సామాజికవర్గం మొత్తానికి సంబంధించినదన్నారు. యూజేఏసీ జిల్లా కన్వీనర్‌గా జాఫర్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముంతాజ్‌బేగం, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, హెల్పింగ్ హ్యాండ్స్ షబ్బీర్, మానవ హక్కుల జాకీర్ హుస్సేన్, ఆవాజ్ వలి, ముక్తియార్, బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు మహమ్మద్ రఫి పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న సంచార జాతులు

ప్రజా సైన్స్ వేదిక కన్వీనర్ డాక్టర్ సురేష్‌బాబు


సంచార జాతులవారితో సురేష్‌బాబు

అనంతపురం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల సంచార జాతులు కనుమరుగవుతున్నాయని ప్రజా సైన్స్ వేదిక కన్వీనర్ డాక్టర్ ఎం. సురేష్‌బాబు పేర్కొన్నారు. ఆ వేదిక జిల్లా కార్యాలయంలో శనివారం సంచార జాతుల వారితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా సంచార జాతులు ప్రభుత్వ పథకాల నుంచి, సామాజిక వనరుల నుంచి, రాజకీయ ప్రాతినిధ్యం నుంచి దూరంగా ఉంటున్నాయన్నారు. పలు తెగలు నేటికీ తీవ్ర నిర్లక్ష్యాన్ని ఎదుర్కొంటున్నాయన్నారు. వీటిలో కిన్నెర జోగులు ముఖ్యమైనవన్నారు. మహారాష్ట్ర నుంచి వలస వచ్చి, అనంతపురం జిల్లా కల్లూరు ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో తాత్కాలికంగా స్థిరపడిన ఈ సముదాయం ఒకప్పుడు సంప్రదాయ గాయకులు, కథకులు గా ప్రసిద్ధి చెందారని తెలిపారు. ఇపుడు వారి జీవితం అసంఘటిత కూలి పనులకు, పేదరికానికి, సామాజిక అజ్ఞానానికి పరిమితమైందని వాపోయారు. ఈ సముదాయాలకు కేవలం జీవనమే కాకుండా గౌరవప్రదమైన భవిష్యత్తు అవసరమన్నారు. వీరి సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించి, వారిని సామాజికంగా, ఆర్థికంగా నిలదొక్కునేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పౌర స్పందన వేదిక ప్రతినిధి ప్రొఫెసర్ వెంకటశివారెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడూ హౌసింగ్ సర్వే

అనంతపురం వైద్యం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పేదలకు సొంత స్థలం కేటాయింపు, కొత్త ఇల్లు మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హౌసింగ్ సర్వే ప్రక్రియ ఆదివారం కూడా కొనసాగనుంది. ఈనెల 10నుంచి జిల్లాలో గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో సర్వేను నిర్వహిస్తున్నారు. శనివారం 48వేల కుటుంబాలను సర్వే నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఈనెల 30వరకు ప్రభుత్వ గడువు విధించడంతో ఆదివారం సర్వే ప్రక్రియ ముగియనుంది. సర్వేలో పాల్గొనలేకపోయిన కుటుంబాలు వారి ప్రాంత సచివాలయాలకెళ్లి దరఖాస్తులు సమర్పించాలని జిల్లా గృహణ నిర్మాణ సంస్థ అధికారిణి శైలజ సూచించారు.

రేపు హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ సీనియర్స్ ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు సోమవారం ఎల్ఆర్‌జీ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సాకే శివ శంకర్ తెలిపారు. క్రీడాకారులు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, యునిఫాం, క్రీడాసామగ్రితో హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 8978137522, 8074793673లను సంప్రదించాలని కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పెనుకొండ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు డీఆర్‌డీఏ, సీడాప్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి లక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 19-26సంవత్సరాలు వయసు కలిగిన ఉమ్మడి జిల్లాకు చెందిన యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 90రోజుల శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. అనంతపురంలోని ఎస్కె యూనివర్సిటీలో ఆదివారం నుంచి శిక్షణ ప్రారంభం అవుతుందని ఆమె తెలిపారు.

బాబయ్య ఉరుసును విజయవంతం చేద్దాం

పెనుకొండ ఆర్డీఓ, డీఎస్పీ

పెనుకొండ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన పెనుకొండ బాబయ్య 753వ ఉరుసు మహోత్సవాన్ని విజయవంతం చేద్దామని ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ నర్సింగప్ప పిలుపునిచ్చారు. ఉరుసు విషయంగా ఆర్డీఓ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబరు 2 నుంచి ప్రారంభమయ్యే ఉరుసు ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి అనేకమంది హాజరవుతారన్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఉరుసుకు వచ్చే సమయంలో 44వ జాతీయ రహదారిపై బైక్ రేసింగ్ జరగకుండా కట్టడి చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, రాజేష్, కమిషనర్ సతీష్‌కుమార్, మైనార్టీ నాయకులు దాదు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వైభవంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో ఉత్సవ విగ్రహం

ధర్మవరం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరులో ప్రసిద్ధి చెందిన ఆంజనేయ స్వామి గ్రామోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు సత్యం స్వామివారి మూలవిరాట్‌ను వివిధ రకాల పూలతో, తులసిమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామానికి చెందిన స్వామి మాల ధారులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. జ్యోతుల మహోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

రేపు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ధర్మవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా సోమవారం ధర్మవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్టు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్ర నాయక్, ఐసీటీసీ మెడికల్ అధికారి నజీర్, ఐసీటీసీ కౌన్సలర్ వనమాల, ప్రాజెక్టు మేనేజర్ నవీన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కాలేజ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ప్రజలు, సంబంధిత అధికారులు పాల్గొని ఈ ర్యాలీని విజయవంతం చేయాలని వారు కోరారు.

పది మోడల్ పేపర్ల ఆవిష్కరణ


యూటీఎఫ్ మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం ప్రచురించిన పదో తరగతి పరీక్షల మోడల్ పేపర్లను కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ శనివారం కలెక్టరేట్‌లోని తన చాం బర్‌లో ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయ చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, డీఈఓ క్రిష్టప్ప, ఎస్ఎస్ఏ ఏపీసీ దేవరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి యేటా యూటీఎఫ్ పదో తరగతి విద్యార్థుల కోసం అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో తయారుచేసిన మోడల్ పేపర్లను ప్రచురించడం అభినందించదగ్గ విషయమన్నారు. విద్యార్థులతో ఈ మో డల్ పేపర్లను వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో క్రమం తప్పకుండా చదివించి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు భూతన్న, జిల్లా కార్యదర్శులు నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, శివశంకర్ బాబు, అమర నారాయణరెడ్డి, సకల చంద్రశేఖర్, కృష్ణతేజ, అమర్‌నాథరెడ్డి, సురేష్, సంజీవప్ప తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

బత్తలపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని దంపెట్ల గ్రామానికి చెందిన హరీష్ అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. అతడు ఓ మైనర్ బాలికను నమ్మించి, మోసం చేశాడని ఆ బాలిక తండ్రి బత్తలపల్లి పోలీ సులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ప్రభాకర్ విచారించారని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి నిందుతుడు హరీష్‌ను కోర్టుకు హాజరుపరచగా, న్యాయాధికార్థి 14 రోజులు రిమాండు విధించినట్లు తెలిపారు.

శైలం బెడస కోళ్ల మృతి

కొత్తచెరువు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక వేణుగోపాల్‌నగర్ కాలనీలో బోయ చంద్ర అనే వ్యక్తికి చెందిన 10 శైలం బెడసకోళ్లు శనివారం మధ్యాహ్నం ఉన్నట్టుండి మృతిచెందాయి. రూ.40వేలు వెచ్చించి కోళ్ల పెంపకం చేపట్టానని, రోజు మాదిరిగానే కోళ్లను శనివారం మేతకోసం బయటకు వదిలానని బాధితుడు తెలిపాడు. అయితేఎవరో గుర్తుతెలియని వ్యక్తులు విషాహారం పెట్టడంతో మృతిచెందాయని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో రూ.40వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

ఇంట్లో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్



కాలిబూడిదైన సామగ్రి

ధర్మవరం రూరల్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తు సామగ్రి కాలి బూడిదైనట్లు మండలంలోని పోతుల నాగేపల్లిలో ఆశా కార్యకర్తగా పనిచేస్తున్న ఆదినారాయణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని ఆశా కార్యకర్త ఇంట్లోని వంట గదిలో శనివారం మధ్యాహ్నం ఉన్నఫలంగా షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో వంటింట్లోని వాషింగ్‌మెషిన్, కూలర్, ఫ్రిజ్, లోన్ ద్వారా తెచ్చుకున్న రూ. 2.5లక్షల విలువచేసే శానిటరీ ప్యాడ్స్, ఇతర సామాగ్రి కాలిబూడిదయ్యానని బాధితురాలు వాపోయారు. దీంతో రూ. 3లక్షల వరకు నష్టపోయినట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆమె కోరారు.

అధైర్య పడవద్దు... అండగా ఉంటాం

● బాధితురాలికి ఎమ్మెల్యే భరోసా


చంద్రశేఖర్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అన్ని విధాల అండగా ఉంటామని, అధైర్యపడవద్దని, కుమారుడిని కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న తిరుపాలమ్మకు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి భరోసా ఇచ్చారు. పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకురాలు తిరుపాలమ్మ కుమారుడు చెరుకూరి చంద్రశేఖర్ (45) శుక్రవారం అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. సాఫ్ట్‌వేర్‌రంగం అభివృద్ధికి సంబంధించిన ఎంఓయూ కోసం విజయవాడ వెళ్లి పుట్టపర్తికి వస్తూ రోడ్డుప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం చంద్రశేఖర్ అంత్యక్రియల్లో పాల్గొని ఆ కుటుంబానికి భరోసాఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటుగా టీడీపీ నాయ కులు రామాంజినేయులు, సామకోటి ఆదినారాయణ, గంగాదర్‌నాయుడు, రామారావు, అంబులెన్సు రమేష్, జయప్రకాష్, బేకరినాయుడు, సుబ్రహ్మణ్యం, చెన్నకేశవులు, సురేష్‌కుమార్, టీడీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయంలో పని చేయని ప్రింటర్

● ఇబ్బందులు పడుతున్న ఆరు గ్రామాల ప్రజలు


ప్రింటర్ పనిచేయకపోవడంతో నిరాశ వ్యక్తం చేస్తున్న ప్రజలు

నల్లచెరువు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పి.కొత్తపల్లి పంచాయతీ కేంద్రంలో ఉన్న గ్రామసచివాలయంలో కొద్ది నెలలుగా ప్రింటర్ మిషన్ పనిచేయడం లేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం వేళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పి.కొత్తపల్లి, పి. కొత్తపల్లి తండా రెండు పంచాయతీలకు సంబంధించి ఇదే గ్రామ సచివాలయం. దీంతో ఆ రెండు పంచాయతీల్లో ఆరు గ్రామాల ప్రజలు పలు కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలతో పాటు 1-బి, ఇంటి స్థలాల పట్టాల కోసం ఈ గ్రామ సచివాలయానికి వెళ్తంటారు. అయితే ఇక్కడ ప్రింటర్ పనిచేయక పోవడంతో నిరాశతో వెనుదిరుగుతు న్నారు. అయితే చేసేదేమీలేక గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి ఆయా గ్రామాల ప్రజలు క్యూ కడుతున్నారు. ఇక్కడ ప్రింటర్ పనిచే యడం లేదని మండల అధికారులకు పలు మార్లు తెలిపినా వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదని సచివాలయ సిబ్బందే బహిరంగంగా ప్రజలకు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రింటర్ బాగు చేయించాలని ఆ రెండు పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే కందికుంట
● ఖబ్బం నరసింహస్వామి ద్వారం స్థలం పరిశీలన


కటారుపల్లి పంచాయతీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గాండ్లపెంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కటారుపల్లిలోని క్రాస్‌లో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ) వద్ద నెలకొన్న స్థల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గ్రామస్థులకు తెలిపారు. ఖబ్బం నరసింహస్వామి ద్వారం స్థలం వివాదాన్ని పరిష్కరించాలని కటారుపల్లి పంచాయతీ వాసులు గత ప్రజావేదికలో ఇచ్చిన అర్జీపై స్పందించిన ఎమ్మెల్యే శనివారం అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ముద్దన్నగారిపల్లి గ్రామస్థులు మాట్లాడుతూ... కటారుపల్లి పంచా యతీలోని దోరణాల, ముద్దన్నగారిపల్లి, జురుకోరుపల్లి, గజ్జలవాండ్లపల్లి గ్రామస్థులు ఖబ్బం నరసింహస్వామికి విశేష పూజలు చేసేవారన్నారు. ఈ ద్వారం గుండా భక్తులు నరసింహ స్వామిని దర్శించుకునేవారని ఎమ్మెల్యేకి తెలిపారు. అలాగే కటారుపల్లి క్రాస్‌లోని కొందరు శ్మశానవాటికను పక్కన ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు అయితే ఆ రెండూ కేజీబీవీ ఆవరణలోకి వెళ్లాయన్నారు. దీనిపై ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులతో చర్చించారు. ప్రస్తుతం అక్కడ ఉన్నటువంటి స్థలాన్ని కొలతలు వేసి వివరాలు ఇవ్వాలని సూచించారు. ఎవరూ ఆవేశాలకు గురై సమస్యలను పెంచుకోవద్దని, కటారుపల్లి క్రాస్ వాసులకు శ్మశాన వాటిక స్థల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబురావు, ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి, వీఆర్ఓలు, సర్వేయర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు: ఎమ్మెల్యే

విద్యార్థి దశలో క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కేజీబీవీ విద్యార్థులకు సూచించారు. ఆయన శనివారం కేజీబీవీని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో విద్య, వసతులపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల చదువుల కోసం రూ. కోట్లు ఖర్చు చేస్తోందని, అందులో భాగంగానే ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో తల్లికి వందనం సొమ్మును ప్రతి ఏటా జమ చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ విద్యపై దృష్టి సారించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రతిష్ఠలు తేవాలని సూచించారు. పాఠశాల ఎస్ఓ దుర్గ, సింగిల్ విండో ఛైర్మన్ రామాంజులరెడ్డి, నాయకులు నరసింహులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో పెద్దఎత్తున అర్జీలు

● అన్నింటినీ పరిష్కరిస్తాం : పరిటాల శ్రీరామ్


సమస్యలను పరిటాల శ్రీరామ్‌కు విన్నవిస్తున్న మహిళలు

ధర్మవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎర్రగుంట టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. వినతులు అందించడానికి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. ముఖ్యంగా పట్టణంలోని 40 వార్డులలో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని ఆయా వార్డు ప్రజలు పరిటాల శ్రీరామ్‌కు వినతిపత్రాలు అందజేశారు. అదే విధంగా చెత్త సేకరణ చేసే ఆటోలు, ట్రాక్టర్లు చెత్త సేకరణకు తిరగడం లేదని, 15 రోజులకు ఒకసారి కూడా మురుగు కాలువలను శుభ్రంచేయలేదని ఆయన దృష్టికి తెచ్చారు. లో ఓల్టేజ్ సమస్య అధికంగా ఉందని, దీంతో గృహోపకరణాలు కాలిపోతున్నాయని ప్రజలు వివరించారు. పట్టణంలో ఇనుప కరెంటు స్తంభాలు అధికంగా ఉన్నాయని, వర్షం వచ్చినప్పుడు వాటికి విద్యుత్ సరఫరా అవుతోందని విన్నవించారు. పట్టణంలోని పలు వార్డులలో నివాస గృహాలపై కరెంటు వైర్లు ఉన్నాయని విన్నవించారు. సమస్యలన్నింటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తామని ఆయన ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫణికుమార్, సంధా రాఘవ, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, భీమనేని ప్రసాద్‌నా యుడు, జింకా పురుషోత్తం, చీమల రామాంజి, విజయసారథిచౌదరి, చిన్నూరు విజయ్‌చౌదరి, చీమల సూరి, చీమల నాగరాజు, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు తెలిపితే పరిష్కరిస్తాం : ఎంపీపీ

గాండ్లపెంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి, ఎంపీడీఓ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశంలో... ప్రభుత్వ వివిధ శాఖ అధికారులు ఆయా శాఖల పనితీరు, సంక్షేమ పథకాల అమలు గురించి తెలియజేశారు. సమావేశంలో కురుమామిడి సర్పంచ్ సుధాకర్ మాట్లాడుతూ... పంచాయతీలో తాగునీటి కోసం రూ. 7లక్షలు ఖర్చు చేశాననీ, వెంటనే బిల్లులు అందేలా చూడాలని కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి, ఎంపీడీఓ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు, అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, వైఎస్ ఎంపీపీలు గంగోజమ్మ, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కొంటే చర్యలు

● రెవెన్యూ అధికారుల హెచ్చరిక

తనకల్లు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డి - పట్టా భూములు, ప్రభుత్వ భూములను కొనుగోలు చేసినా, అక్రమించినా చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. మండలపరిధిలోని మల్లిరెడ్డిపల్లి రెవెన్యూ పొలంలో డి-పట్టాలు, నిషేధిత 22-ఎలో ఉన్న భూములను బెంగళూరుకు చెందిన ధనికులు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ఈవిషయంపై ఆంధ్రజ్యోతి దినపత్రిలో 'పేదల భూములపై పెద్దల కన్ను' అన్నవార్త ఈ నెల 24న ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన రెవెన్యూ అధికారులు రెండురోజులుగా మల్లిరెడ్డిపల్లి పంచాయతీలోని అన్ని గ్రామాల్లో దండోరా వేయిస్తున్నా. డి - పట్టా భూములు, ప్రభుత్వ భూములను కొనుగోలు చేసినా, అక్రమించినా చర్యలు తప్పవంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఈవిషయంపై తహసీల్దార్ షాబుద్దీన్ సిబ్బందితో కలిసి గ్రామాల్లో పర్యటించారు.

ఆంధ్రజ్యోతి స్పందన

సంస్కృతిలో ఇంటర్నేషనల్ ఏరియా కంటెస్ట్


విద్యార్థులకు ప్రతిభా అవార్డులను అందచేస్తున్న టోస్ట్ మాస్టర్లు

పుట్టపర్తి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్‌లో అంతర్జాతీయ స్థాయి టోస్ట్‌మాస్టర్లు ఏరియా కంటెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కంటెస్ట్‌లో శనివారం అంతర్జాతీయ స్థాయిలోని వివిధ క్లబ్‌ల నుంచి 50 మంది ప్రముఖ టోస్ట్‌మాస్టర్లు పాల్గొని ఏరియా కంటెస్ట్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ఛైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ప్రోగ్రాం రాయలసీమ రీజియన్‌లోనే మొట్టమొదటిసారి నిర్వహించడం సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్‌కు గర్వకారణమన్నారు. అనంతరం టోస్ట్‌మాస్టర్లు నవీన్‌సామల, విక్రమ్ చంద్ర, అజిత్‌డెంబ్లా, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, వెంకటరమణ, స్వాతి, సంగీతజోనీ కార్తీక్, వెంకట దిట్టకవి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో ప్రపంచస్థాయి కమ్యూనికేషన్స్, వ్యక్తిత్వ వికాసం, పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలు అభివృద్ధి చెందే వీలు కలుగుతుందన్నారు. అనంతరం ఏరియా కాంటెస్ట్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలను వారు అందజేశారు.

కల్లు గీత కార్మికుడికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

నల్లచెరువు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు ఆంజనేయులు గత వారం చెట్టుపై నుంచి కిందపడి గాయపడ్డాడు. ఈ విషయాన్ని టీడీపీ స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గాయపడిన ఆంజనేయులుకు రూ. 50వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆ మొత్తాన్ని శనివారం టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్, నాయకులు గుత్తాప్రసాద్, సతీష్‌నాయుడు, నాగరాజు, దేవేంద్రగౌడ్ తదితరులు బాధితుడికి అందజేశారు.

అధికారులు రాకపోతే సమావేశాలెందుకు?

● కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ధ్వజం


సమావేశంలో ఖాళీగా ఉన్న కమిషనర్ కుర్చీ

ధర్మవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సమావేశానికి కమిషనర్, టీపీఓ, మేనేజర్లు గైర్హాజరైతే సమావేశాలెందుకు నిర్వహించాలని కౌన్సిలర్లు మండిపడ్డారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావే శాన్ని నిర్వహించారు. ముందుగా వైస్‌ఛైర్మన్ జయరామిరెడ్డి మాట్లాడుతూ...గత కౌన్సిల్ సమావేశంలో పోతులనాగేపల్లి, రేగాటిపల్లి, కుణుతూరు లేఅవుట్లలోని కాలనీలను మున్సిపాలిటీలోకి చేర్చాలని తెలిపామని, అయితే వాటి గురించే ఇంతవరకు ప్రస్తావించలే దన్నారు. వార్డులలో నెలకొన్న సమస్యలను సమావేశంలో విన్నవిద్దామంటే కమిషనర్ సాయికృష్ణ, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ అలివేలమ్మ,, మేనేజర్ రాజేశ్వరిబాయి ఉద్దేశ్యపూర్వకంగానే అధికారులు సెలవు పెట్టారని. అలాంటప్పుడు ఎవరికైనా ఇన్‌చార్జ్ ఇవ్వాలికదా? అని ప్రశ్నించారు. అనంతరం 34వ వార్డు కౌన్సిలర్ చందమూరు నారాయణరెడ్డి మాట్లాడుతూ... కుక్కల ఆపరేషన్‌ల కోసం రూ.18 లక్షలు మంజూరుచేశారని, వాటి ఖర్చు వివరాలు తెలపాలన్నారు. స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్సన్ మాట్లాడుతూ... పట్టణంలో దాదాపు మూడు వేల దాకా కుక్కలు ఉన్నాయని, వీటిలో 1100 దాకా కుక్కలకు ఆపరేషన్‌లు చేయించామన్నారు. 11 కుక్కలకు ఒకసారి చేస్తున్నామన్నారు. అనంతరం 24వ వార్డు కౌన్సిలర్ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ...మున్సిపల్ రిజర్వు స్థలం నుంచి అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్నారని, దానిని అరికట్టాలన్నారు. పట్టణంలోని మహనీయుల విగ్రహాల చుట్టూ కట్టిన ఫ్లెక్సీలను తొలగించాలని కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేశారు. కో ఆప్షన్ సభ్యుడు రామకృష్ణ మాట్లాడుతూ...కదిరిగేటు వద్ద రోడ్డుపై గుంతలు ఉండటంతో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అదేవిధంగా మాధవనగర్‌లో బలిజ కల్యాణమండపం ఎదురుగా వెళ్లే రహదారి, ఎల్ఎల్‌వీ మార్కెట్ వీధిలో ప్రభుత్వ ఆస్పత్రి వెనుక రోడ్డు అధ్వానంగా ఉన్నాయని కౌన్సిలర్లు కేతా లోకేశ్, గజ్జలశివ ఛైర్మన్ దృష్టికి తెచ్చారు. కౌన్సిల్ సమావేశానికి గైర్హాజరైన అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు తొమ్మిదో వార్డు కౌన్సిలర్ సాయికుమార్ తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్‌పర్సన్ షేక్‌షంషాద్‌బేగం కౌన్సిలర్లు, డీఈ వీరేశ్, ఏఈలు కళావతి, శిరీష, మెప్మా టీపీఓ విజయభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి

ఘనంగా అయ్యప్ప పడిపూజ



ధర్మవరం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల గ్రామంలో అయ్యప్పస్వామి పడిపూజోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు అయ్యప్ప చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి పడిపూజ నిర్వహించారు. 18మెట్లను అలంకరించి దీపాలు వెలిగించారు. మాలధారుల అయ్యప్పనామ స్మరణ, సంకీర్తనతో ప్రాంతం మార్మోగింది. అనంతరం హారతులు పట్టి పూజలు చేశారు.

అర్హులందరికి అన్నదాత సుఖీభవ

● 'రైతన్నా.. మీకోసం'లో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి


రైతన్నా.. మీ కోసం కరపత్రాలతో ఎమ్మెల్యే తదితరులు

పుట్టపర్తి రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అర్హులైన ప్రతిఒక్క రైతు ఖాతాలో అన్నదాత సుఖీభవ నిధులు జమ అవుతున్నాయని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వెంగళమ్మచెరువులో శనివారం నిర్వహించిన 'రైతన్నా మీ కోసం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంక్షేమం ఒక్క కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. రైతులు మార్కెట్‌లో డిమాండ్‌ఉన్న పంటలను సాగుచేయాల న్నారు. భూగర్భ జలాల పెంపు కోసం ఇంకుడు గుంతలు నిర్మించుకోవా లని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీరామిరెడ్డి, పీఏసీసీ డైరక్టర్లు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


దిగువపల్లిలో పాల్గొన్న టీడీపీ నాయకులు, అధికారులు

ఓబుళదేవరచెరువు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువపల్లిలో శనివారం రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఇలియాజ్ అహ్మద్, రాష్ట్ర బీసీ సెల్ నాయ కులు జెరిపిటి ఆంజినప్ప, ఎంపీఈఓ అనీల్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణపై అవగాహన

నంబులపూలకుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణపై మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలల హక్కులు, రక్షణ, ఆరోగ్యపరిరక్షణ, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నరసమ్మ, కౌన్సిలర్ శివలత, అంగన్‌వాడీ కార్యకర్తలు సావిత్రి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

'మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి'

కదిరి అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయొద్దంటూ శనివారం పీఎస్ఎఫ్ఐ, ఎన్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రైవేటీకరణ వల్ల పేదవారికి ఉచిత వైద్య సేవలు అందని ద్రాక్షలా మారుతాయన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రవి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ విద్యార్థి సంఘాల నాయకులు అరుణ్‌కుమార్, ప్రశాంత్, ఈశ్వర్, బాలు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

గోల్ షాట్ జిల్లా జట్టుకు కదిరి విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో బ్లూమూన్ పాఠశాల యాజమాన్యం

కదిరి అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గోల్ షాట్ జిల్లా జట్టుకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు బ్లూమూన్ విద్యాసంస్థల ఛైర్మన్ శివ శంకర్ తెలిపారు. కదిరిలో బుధవారం జరిగిన గోల్ షాట్ పోటీలలో పాఠశాల విద్యార్థులు తరుణ్, పునీత్, రేవంత్, దేవేంద్ర పాల్గొని ప్రతిభ కనపరచి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో జరిగిన ఓ సమావేశంలో ఆ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేంద్ర రెడ్డి, ఇంచార్జ్ మాధవరెడ్డి, పీఈటీ రామాంజులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఓడీసీ విద్యార్థులు


రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఓబుళదేవరచెరువు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలం లోని మిట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జ్యోత్స్న, స్వాతి రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాలాజీనాయక్, వ్యాయామ ఉపాధ్యాయుడు కొత్తపల్లి దానమయ్య తెలిపారు. ఎంపికైన విద్యార్థులు డిసెంబర్ 1, 2 తేదీలలో పల్నాడు జిల్లా నరసారావుపేటలో జరిగే హ్యాండ్ బాల్ పోటీలలో రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యా యులు పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

కరాటే పోటీల్లో ధర్మవరం విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభిందిస్తున్న ప్రిన్సిపాల్

ధర్మవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యశోద పాఠశాల విద్యార్థి మహీధర్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో సత్తాచాటి రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నట్టు పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూప్ తెలిపారు. రాజమండ్రిలో ఈనెల 23,24తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే అండర్-14 బాలుర విభాగంలో పాఠశాలలో తొమ్మిది తరగతి చదువుతున్న మహీధర్ ప్రతిభ కనబరచినట్లు తెలిపారు. ఆ విద్యార్థిని పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

'రోడ్డుమాటున మాయ'పై

కదిలిన రెవెన్యూ యంత్రాంగం

రెండు రోజుల్లో హద్దుల నిర్ణయం



సర్వేచేస్తున్న రెవెన్యూ, గొర్రెల పెంపక క్షేత్రం సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెనుకొండ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రిసార్టుకు ప్రభుత్వ భూమిలో 44 అడుగుల రోడ్డు సర్వేపై రెవెన్యూ యంత్రాంగం కదిలింది. శనివారం ఆంధ్రజ్యోతిలో 'రోడ్డుమాటున మాయ' కథనం ప్రచురితమైంది. స్పందించిన రెవెన్యూ అధికారులు ఆర్ఐ షాషావలి, సర్వేయర్, గొర్రెల పెంపకక్షేత్రం సిబ్బంది గంగాధర్ సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ సర్వే రెండు రోజుల్లో పూర్తిచేసి హద్దులు నిర్ణయిస్తామన్నారు. గొర్రెల పెంపక క్షేత్రానికి సంబంధించిన భూమిలో కంచెవేసుకోవాలని సూచించారు. అనంతరం పక్కనే ఉన్న వంక ఎన్ని అడుగులుంది..? దానిని సర్వేచేసి హద్దులు నాటుతామన్నారు. అంతవరకు రాకపోకలు కొనసాగించరాదని తెలిపారు. తహసీల్దార్ స్వాతికి పెనుకొండ పట్టణానికి చెందిన పలువురు రిసార్ట్ దారి పేరుతో దురాక్రమణ చేస్తున్నారని వంకను, గొర్రెల పెంపక క్షేత్రం భూములు కాపాడాలని వినతిని అందించారు.

చెరువును శుభ్రం చేసిన పారిశుధ్య కార్మికులు



చెరువును శుభ్రంచేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఆంధ్రజ్యోతికి స్పందన

పరిగి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చెరువును పారిశుధ్య కార్మికులు శనివారం శుభ్రం చేశారు. చెరువులో వ్యర్థాలు వేసి నీరుకలుషితం చేస్తున్నారంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన సచివాలయ సిబ్బంది వ్యర్థాలు తొలగించారు. చెరువులో వ్యర్థాలు వేయకుండా నీటి కలుషితాన్ని ఆపుతామని, చికెన్, మందుల షాపుల దుకాణాలవారికి హెచ్చరికలు జారీచేస్తామంటూ కార్యదర్శి నారాయణ తెలిపారు.

రైతుల కష్టాలు తీరుతున్నాయి

రైతన్నా.. మీకోసం'లో టీడీపీ నాయకులు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల కష్టాలు ఒక్కొక్కటిగా తీరుతున్నాయని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని బండ్లపల్లి, కల్లుకుంట గ్రామాల్లో మండల ఏఓ కవితారాణి ఆధ్వర్యంలో చేపట్టిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? పంటల సాగులో ఏవైనా సమస్యలు ఉన్నాయా? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏ క్రిష్ణయ్య, హిందూపురం మార్కెట్ యార్డు చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, మండల కన్వీనర్ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ బయప్ప, గౌరీశంకర్, బాలాజీ, విశ్వనాథరెడ్డి, మంజు, చంద్ర, కృష్ణమూర్తి, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేంద్ర, ఏఈఏ విద్య తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను రైతులకు వివరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

● **రొద్దం:** రైతులు అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందని వ్యవసాయాధికారి రాజేష్ పేర్కొన్నారు. శనివారం రొద్దం మండల పరిధిలోని కలిపి, రొద్దం, కంబాలపల్లి, చిన్నమంతూరు తదితర గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు పంచసూత్రాలు వాటి వినియోగంపై వివరించారు.



రైతులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

● **రొళ్ల:** మండలం రొళ్లకొండలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారి వెంకటబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కన్వీనర్ ఈరన్న, రామక్రిష్ణ, ఆనంద్, రాజు, గోవిందరాజు, నాగేంద్ర, బ్యాంక్ బాలరాజు తదితరులు ఇంటింటికి వెళ్లి అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ తదితర సంక్షేమ పథకాలను వివరించారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

సగర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ

సోమందేపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని సగర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ తెలిపారు. శనివారం మండలంలోని మండ్లి, జూలకుంట, ఆనందాపురం గ్రామంలో ఏరియా, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్‌స్థాయి నుంచి ప్రజలకు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. స్థానిక సంస్థల్లో మెజార్టీ స్థానాలను గెలుపొందేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహులు, నాయకులు నారాయణ పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాలకు పశువుల దాణా

సోమందేపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతుసేవాకేంద్రానికి శనివారం పశువులదాణా చేరినట్లు పశుసంవర్థకశాఖ అధికారి హేమలత తెలిపారు. వంద బస్తాల దాకా నిల్వ ఉందన్నారు. సోమవారం నుంచి వాటిని పాడిరైతులకు అందిస్తామన్నారు. అవసరమైనవారు ఆధార్‌కార్డు, ఫోన్‌నంబరు, ధృవీకరణ పత్రంతో కార్యాలయాన్ని సందర్శించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు

మడకశిరటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి సమస్యను సకాలంలో పరిష్కరించడమే లక్ష్యమని ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు. నియోజకవర్గం నుంచి సమస్యలు చెప్పుకొనేందుకు తరలివచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను కాలపరిమితి నిర్ణయించుకొని సకాలంలో పరిష్కారం అధికారులు చూపాలని ఆదేశించారు. కార్యాలయాల చుట్టూ సామాన్యులను తిప్పుకోవద్దని, ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఫోన్‌లలో పలు ఆదేశాలు జారీ చేశారు. కార్యాలయంలో ప్రత్యేకంగా ప్రతి ఫిర్యాదు శాఖకు సంబంధించి భద్రపర్చి ఎప్పటికప్పుడు సమస్య ఎంతవరకు పరిష్కారం అయ్యిందో తెలుసుకొని పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

● **మడకశిర రూరల్:** భక్తరహళ్లి నరసింహస్వామి, జిల్లేడగుండ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. శనివారం భక్తరహళ్లి నరసింహస్వామి ఆలయం ఆవరణంలో వివిధ శాఖల అధికారులు, పాలకమండలి సభ్యులతో బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రూ. 24 లక్షలతో రెండు దేవాలయాల సమీపంలో నీటి సౌకర్యం, స్నానాల గదులు నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, ఈఓ నరసంహరాజు, సర్పంచు రామాంజనేయులు, మండల కన్వీనర్ నాగరాజు. ఆలయకమిటీ చైర్మన్ నర్సేగౌడ్ పాల్గొన్నారు.

అవినీతిపై విజిలెన్స్ విచారణ

● **మడకశిరటౌన్:** నగర పంచాయతీ పరిధిలో వైసీపీ హయాంలో అనేక అక్రమాలు జరిగాయని, వాటిపై విజిలెన్స్ విచారణ చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కౌన్సిల్ సమావేశంలోనే విజిలెన్స్ విచారణకు సంబంధించి కౌన్సిల్ తీర్మానం చేసి పంపాలని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. ఎంతవరకు వచ్చిందన్న సమాచారంపై అధికారులను ఆరాతీశారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

అనారోగ్యంతో వచ్చే ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. శనివారం మడకశిర వైద్య విధానపరిషత్‌లో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రోగాలతో బాధపడుతూ ఆస్పత్రికి వస్తుంటారని, వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, కమిషనర్ జగన్నాథ్, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, వైద్యాధికారిణి డాక్టర్ శశిరేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ కంఠం భూ రిజిస్ట్రేషన్‌లను సద్వినియోగం చేసుకోండి

మడకశిర: నగర పంచాయతీ పరిధిలో నిషేధిత జాబితాలో ఉన్న గ్రామ కంఠం సర్వేనెంబర్ 419లోని భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సూచించారు. కలెక్టర్ ఆదేశాలతో మడకశిర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయడం జరుగుతుందన్నారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ నరసింహమూర్తితో కలిసి మాట్లాడారు. సర్వేనెంబర్ 419లో 63 ఎకరాల భూములు ఉన్నాయని, గతంలో భూములు నిషేధిత జాబితాలో ఉండేవని, కలెక్టర్ ఆదేశాలతో తిరిగి రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్నారు.

పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లో పెట్టండి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్



హాజరైన కౌన్సిలర్లు

మున్సిపల్ కౌన్సిల్‌మీట్‌లో చైర్మన్ రమేష్

హిందూపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో టెండర్లువేసి పనులు చేయని కాంట్రాక్టర్లు ఒకరిద్దరిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని అప్పుడే పనులు ముందుకు సాగుతాయని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ రఘు మాట్లాడుతూ 38 వార్డులకు సంబంధించి రూ.3లక్షలు నిధులు పనులు కేటాయించారని, అయితే ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. దీంతో ఎప్పుడు ప్రారంభం అవుతాయో తెలియజేయాలని కోరారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మంచి లాభాలు వచ్చే పనులు మాత్రమే కాంట్రాక్టర్లు చేస్తున్నారని, మిగిలినవాటిని చేయడంలేదన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు. అలాంటప్పుడు టెండర్లలో ఎందుకు పాల్గొనాలని ప్రశ్నించారు. అలాంటి వారిని ఒకరిద్దరిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని అప్పుడే కాంట్రాక్టర్లు పనులు చేస్తారన్నారు. మరికొంతమంది కౌన్సిలర్లు మాట్లాడుతూ అక్రమ కొళాయి కనెక్షన్‌లు ఉన్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ కొళాయి కనెక్షన్‌లు తీసుకున్నవారిని గుర్తించి రూ.10వేలు చెల్లిస్తే వారికి రెగ్యులర్ చేస్తామన్నారు. ఆస్తి పన్ను వసూలుపై సభ్యులు ప్రశ్నించారు. దీనికి కమిషనర్ సమాధానం ఇస్తూ మున్సిపాలిటీకి రావాల్సిన బకాయిలు ఒక్కరూపాయికూడా వదలకుండా వసూలు చేస్తామన్నారు. పన్నులు ప్రభుత్వం పెంచలేదని సాటిలైట్ సర్వేలో కొన్నింటిని మాత్రమే సరిచేయడం జరుగుతుందన్నారు. వచ్చే బుధవారం నుంచి ఆస్తి పన్ను వసూలుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు చైర్మన్, కమిషనర్ వెల్లడించారు. వందే మాతరం గీతానికి 150ఏళ్ల పూర్తీచేసుకున్న సందర్భంగా జాతీయ సమైఖ్యత దేశ భక్తిని చాటుతూ కౌన్సిల్‌హాల్‌లో వందేమాతరం గీతం ఆలపించారు. సమావేశంలో కౌన్సిలర్ మల్లికార్జున, డీఈలు వాణి, మదన్, వైస్ చైర్మన్ లరాంరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

శిశువు మృతిపై డీఎంహెచ్ఓ విచారణ

హిందూపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో మూడురోజుల క్రితం శిశువు మృతిపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం శనివరం విచారణ చేపట్టారు. పెనుకొండ డివిజనల్ ఉప వైద్యాధికారి మంజువాణితో కలిసి ఆసుపత్రిలో శిశువు మృతిపై ఆరాతీశారు. మృతిచెందిన బిడ్డతల్లి ఆసుపత్రిలో ఎప్పుడు చేరింది..? బిడ్డ మరణించేవరకు జరిగిన పరిణామాలపై బాధిత మహిళ దివ్యశ్రీని అడిగి తెలుసుకున్నారు. చిన్న పిల్లల విభాగంలోని వైద్యులను బిడ్డ ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. అనంతరం జరిగిన ఘటనపై అధికారులతో సమీక్ష జరిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ బాబుబుడేన్, డాక్టర్ శివకుమార్, కీర్తి, ఆర్ఎంఓ నాయక్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



దివ్యశ్రీతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ఫైరోజ్‌బేగం

'సద్వినియోగం చేసుకోండి'

గోరంట్ల, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ఏకల్ గ్రామోత్సం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోరంట్లలో కంప్యూటర్, టైలరింగ్‌పై ఇస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ జిల్లా అధ్యక్షుడు శేషాద్రి తెలిపారు. శనివారం ఉచిత శిక్షణను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 10వతరగతి, ఆపై చదివినవారికి కంప్యూటర్, మహిళలకు టైలరింగ్‌పై మూడునెలలపాటు శిక్షణ ఇస్తామన్నారు. ధృవీకరణ పత్రాలు అందచేస్తామన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి డాక్టర్ రామయ్య, గోవిందురెడ్డి, మురళీ, గురువిరెడ్డి, రామోహన్‌రెడ్డి, శ్రీరాములు, వెంకటనారాయణ, కంప్యూటర్ శిక్షకులు శ్రీనాథ్, టైలరింగ్ శిక్షకురాలు కవిత పాల్గొన్నారు.

ఏఎన్ఎంగా మౌనికాబాయి

గోరంట్ల, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలకు నూతన ఏఎన్ఎంగా మౌనికాబాయిని నియమించినట్లు అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఏఎన్ఎం విజయబాయి స్థానంలో మౌనికాబాయిని నియమించారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

ధర్మవరం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలం లోని చిగిచెర్ల గ్రామంలో అయ్యప్పస్వామి పడిపూజోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు అయ్యప్ప చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి పడిపూజ నిర్వహించారు. 18మెట్లను అలంకరించి దీపాలు వెలిగించారు. మాల ధారుల అయ్యప్పనామ స్మరణ, సంకీర్తనతో ప్రాంతం మార్మోగింది.

రాజ్యాంగ హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

డీటీ జగన్నాథ్

చిలమత్తూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కులను పౌరులు సద్వినియోగం చేసుకోవాలని డీటీ జగన్నాథ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని వీరాపురం గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీల కోసం భారత రాజ్యాంగం ప్రత్యేకంగా తీసుకువచ్చిన చట్టాలను దుర్వినియోగం చేసుకోరాదన్నారు. వ్యక్తి రక్షణ కోసం చట్టాలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి పాల్గొన్నారు.

● **గోరంట్ల:** రాజ్యాంగం కల్పించిన హక్కులను పౌరులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మారుతి సూచించారు. మండలపరిధిలోని గుమ్మయ్యగారిపల్లి, ఎస్సీకాలనీలో పౌరహక్కుల దినోత్సవంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. అంటరానితనం, సాంఘిక నిర్మూలన, పౌరహక్కులపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కమలాబాయి,



మాట్లాడుతున్న తహసీల్దార్ మారుతి

ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు ఉమాశంకర్, శ్రీనివాసనాయక్, పలువురు అధికారులు ఉమాపతి, లక్ష్మీపతి, క్రిష్ణప్ప, రమేష్ పాల్గొన్నారు.

● **అగళి:** మండల కేంద్రంలోని ఆర్డీటీ భవనంలో శనివారం ఎస్సీ కాలనీ వాసులకు పౌరహక్కుల దినోత్సవంపై అధికారులు అవగాహన కల్పించారు. పౌర హక్కులు, చట్టాలను వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బారావు, ఎంపీడీఓ గంగాధర్, జడ్పీటీసీ ఉమేష్, సర్పంచ్ లక్ష్మమ్మ, హనుమంతరాయప్ప, సీనియర్ అసిస్టెంట్ గుర్రన్న, వీఆర్ఓ దొడ్డేగౌడ్, పంచాయతీ కార్యదర్శి రంగనాథ్ ఉన్నారు.

అగళిలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, జడ్పీటీసీ



కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణమే లక్ష్యం

ఏఐసీసీ పరిశీలకుడు అజయ్‌సింగ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కమలమ్మ

మడకశిరటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడం, సంస్థాగతంగా పార్టీని నిర్మాణం చేయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఏఐసీసీ అబ్జర్వర్, గుల్బర్గా ఎమ్మెల్యే అజయ్‌సింగ్ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ బలోపేతంపై నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి తులసిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుధాకర్, కమలమ్మ తదితరులు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి..? డీసీసీ అధ్యక్షులుగా ఎవరిని ఎంపిక చేయాలన్న అంశాలపై నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు సేకరించారు. పార్టీ బలోపేతానికి పలు సూచనలు చేశారు. కాంగ్రెస్ పార్టీని నియోజకవర్గంలో బలోపేతం చేద్దామని, తిరిగి పూర్వవైభవం తేవడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు మంజునాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు



త్రోబాల్‌లో పోటీపడుతున్న మహిళా ఉపాధ్యాయులు

అగళి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధ్యాయులకు శనివారం అగళి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో త్రోబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్, పురుషులకు క్రికెట్ నిర్వహించారు. గెలుపొందిన వారు డిసెంబరు 13, 14 తేదీల్లో మడకశిర డివిజన్‌స్థాయిలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొంటారు. క్రీడల్లో ఎంఈఓ కృష్ణమూర్తి రాజు, చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

క్రికెట్ టీం ఎంపిక



ఎంపికైన జట్టుతో డీవైఈఓ, ఎంఈఓ

గోరంట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ద్వారా మండల ఉపాధ్యాయుల క్రికెట్ టీంను శనివారం ఎంపిక చేశారు. గుమ్మయ్యగారిపల్లి వద్దగల సూర్యదేవర పాఠశాల మైదానలో డివైఈఓ జాన్‌రెడ్డెప్ప, ఎంఈఓ గోపాల్ ఆధ్వర్యంలో 16మంది సభ్యుల క్రికెట్ జట్టును ప్రకటించారు. కెప్టెన్‌గా వానవోలు ఉన్నతపాఠశాల హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, జట్టు సభ్యులుగా అశోక్, శ్రీకాంత్, నాగరాజు, శ్రీనివాసరెడ్డి, రాధరమణ, సాయినాథ్, ప్రకాష్‌రెడ్డి, ఆంజనేయులు, గంగరాజు, విజయ్, బాలు, హనుమంతు, రమేష్‌రెడ్డి, సిరాజుద్దీన్, సాయిమహేష్ ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన జట్టు డిసెంబరు 13, 14 తేదీల్లో డివిజన్‌స్థాయిలో పెనుకొండలో జరిగే పోటీల్లో పాల్గొంటారు.

గ్రామాలు శుభ్రంగా ఉండాలి: ఎంపీడీఓ



నాగేపల్లి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కేశవరెడ్డి

గుడిబండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని ఎంపీడీఓ కేశవరెడ్డి ఆదేశించారు. మండలంలోని కెఎన్‌పల్లి, చిగతుర్పి, కరేకెర గ్రామాల్లోని సచివాలయ కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. గ్రామాలు శుభ్రంగా ఉండేవిధంగా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం గ్రామాల్లో సేకరించిన చెత్తను చెత్త కేంద్రాలకు తరలించి ఎరువులను తయారుచేయాలని సూచించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి వివరాలను అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శులు ప్రకాశ్, గౌరమ్మ, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్



పోషకాహారం గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయులు

పరిగి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో శనివారం ప్రిన్సిపాల్ రమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా ఫుడ్‌ఫెస్టివల్ దినోత్సవం జరుపుకున్నారు. పోషక విలువలు, విటమిన్లు, ఆహార పదార్థాల తయారీని స్టాల్స్‌పెట్టి అర్థమయ్యేలా విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

గుడిబండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకల్లు, కురుబరపల్లి, హిరేతుర్పి, బీటీపల్లి, మద్దనకుంట తదితర గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో స్వామివారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

